Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 15.07.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 06 పేజీలు : 12, వెల : ₹ 5

ISO 9001-2008
Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For State Government, APSPDCL & SHAR Employees



# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## నారాయణ కాలేజీలు...

# అక్రమమా..? సక్రమమా..?



- కాలేజీ భవనాలు ప్లాన్ ప్రకారమే వున్నాయా?
- మంత్రికొక న్యాయం... సామాన్యుడికొక న్యాయమా...?

**గంజాయివనంలో తులసి మొక్కలను వెదకాలంటే ఎంత కష్టమో.. నెల్లూరు నగరంలో అక్రమ భవనాల మధ్య సక్రమ కట్టడాలను గుర్తించడం కూడా అంతే కష్టం.మున్సిపల్ ప్లాన్ అప్రూవల్‌కు విరుద్ధంగా కట్టిన భవనాలను కూల్చే పనే పెట్టుకుంటే 80శాతం భవనాలను కూల్చక తప్పదు. నెల్లూరు నగరపాలక సంస్థలో ప్లాన్ అప్రూవల్స్ పాటికి అవి జరుగుతుంటాయి, నిబంధనలకు విరుద్ధంగా కట్టే భవనాలను కడుతూనే వుంటారు. అసలు గత పదేళ్లలో అయితే టౌన్‌ప్లానింగ్ అప్రూవల్ తీసుకుని కట్టిన నిర్మాణాలకంటే, ఆనం వివేకానందరెడ్డి అనుమతితో కట్టిన భవనాలే ఎక్కువ. అదొక ప్రైవేట్ రాజ్యంగా నడిచిపోయింది.**

ప్రజలు కూడా ఒకరకమైన విధానానికి అలవాటుపడ్డారు. నిబంధనలను అతిక్రమించి భవనాలను నిర్మించుకున్నా బిఆర్ఎస్ క్రింద చేయించుకోవచ్చునే భరోసాతో ఉన్నారు. ఆ భరోసాను ఇప్పుడు మున్సిపల్ మంత్రి నారాయణ (మిగతా 11వ పేజీలో)



## కోట్లు నిధులు...

# 'కృష్ణా'ర్పణం

- ప్రచారం మోత... పుష్కరాల పేరుతో మేత
- గోదావరి పుష్కరాల హంగామా పునరావృతం

**భారతదేశంలో పుష్కరాలకు ఓ పవిత్ర స్థానముంది. ప్రకృతిని దైవంగా భావించడం, పూజించడం మన సంస్కృతి. మనకు ప్రత్యక్ష దైవాలు అవే! ఎందుకంటే వరుణ దేవుడున్నాడో లేడో మనం చూడలేం. కాని గోదావరి, కృష్ణ, పెన్న నదులను మనం చూస్తున్నాం. వర్షాలు కురవడం చూస్తున్నాం. వాటిలోని నీటితోనే మనం పంటలు పండించుకుని తింటున్నాం. వాయు దేవుడిని మనం చూడలేము. కాని చెట్లు ఇచ్చే ఆక్సిజన్‌ను పీలుస్తూ బ్రతుకుతున్నాం. అగ్ని దేవుడిని మనం చూడలేము. కాని మన జీవితంలో అగ్ని ఓ భాగం. ఇలా అన్ని ప్రకృతి ధర్మాలను మనం ఆచరిస్తున్నాం. మనకు జలం, జీవం ఇస్తున్న నదులను పూజించే సంస్కారంలో భాగమే పుష్కరాలు. ఉత్తరాదిన కుంభమేళా అన్నా కూడా ఇదే!**

అయితే దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా పుష్కరాలను పబ్లిసిటీ స్టంట్‌కు, నిధులు మేతకు వాడుకున్న ఘనత చంద్రబాబు సర్కార్‌కే దక్కుతుంది. పుష్కరాలకు ఎప్పుడూ ఎవరూ చేయనంత హంగామా చంద్రబాబు చేస్తున్నాడు. భక్తులు స్వచ్ఛంధంగా వెళ్లి పుణ్య స్నానాలాచరించే ఓ ఆధ్యాత్మిక సంస్కృతికి చంద్రబాబు హైటెక్ హంగులద్దారు. గత ఏడాది జరిగిన గోదావరి పుష్కరాలను ఏ స్థాయిలో హైప్ చేసారో చూసాం. పుష్కరాల పేరుతో (మిగతా 11వ పేజీలో)



- పంథా మారింది

# సీనియర్లకు సలామ్

**జగన్ మారాలి... జగన్ మారాలి... జగన్ మారాలి... అందర్నీ కలుపుకుని పోవాలి... అందరికీ అందుబాటులో ఉండాలి... అందరికీ గౌరవమివ్వాలి... ఇది వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు జగన్‌లో కోరుకుంటున్న మార్పు. దివంగతనేత వై.యస్.రాజశేఖరరెడ్డి రాజకీయ వారసుడిగా రాజకీయాల్లోకొచ్చిన జగన్‌లోనూ వై.యస్. లక్షణాలను, ఆయన స్నేహపూర్వక వ్యక్తిత్వాన్ని ఆశిస్తున్నారు. అయితే ఒక్కటి నిజం... జగన్ వై.యస్. కావడానికి, ఆయన లక్షణాలను పుణికి పుచ్చుకోవడానికి చాలాకాలం పడుతుంది.**

ఈలోపు వై.యస్.లో ఏం చూసి ప్రజలు ఇంతగా ఆకర్షితులయ్యారన్న దానిపై జగన్ దృష్టిపెట్టాలి. ప్రతి నాయకుడిలోనూ మొదట ఉండాల్సిన లక్షణం పెద్ద, చిన్న అన్న తేడా లేకుండా వయస్సును బట్టి గౌరవించడం. వై.యస్. అది చేశాడు. రాజకీయాల్లో తనకన్నా సీనియర్‌లను 'అన్నా' అంటూ ఎంతో మర్యాదగా సంభోదించేవాడు. తనకన్నా వయసులో చిన్నవారిని కూడా ఎంతో ఆప్యాయంగా పలుకరించేవాళ్లు. వై.యస్ మాటతీరే ఆయనకు ఎంతోమంది అనుచరులను, అభిమానులను (మిగతా 11వ పేజీలో)

ఆహారమే ఆరోగ్యం... ఆరోగ్యమే ఆనందం... ఆనందమే మహాభాగ్యం!
గత 46 సంవత్సరాలుగా
రుచికి.. శుచికి... శుభ్రతకి
నమ్మకానికి, నాణ్యతకి చిరునామా...
MK GROUP Since 1970



శ్రీ గ్రోసు గోపాలయ్య
వ్యవస్థాపకులు
మురళీకృష్ణ
అధునాతన హంగులతో
ఎయిర్‌కండిషన్ వసతులతో
త్వరలో పునఃప్రారంభం
కాఫీ టిఫిన్ శాఖాహార భోజనం ఐస్‌క్రీమ్స్
ప్రకాశం పంతులు షాపింగ్ కాంప్లెక్స్, మద్రాసు బస్టాండు వద్ద, నెల్లూరు. ఫోన్: 0861 - 2311611



# ఈ రహదారి గతి ఇంతేనా?

**దాహం వేస్తే బావులు తవ్వుకునే విధానానికి పాలకులు, అధికారులు ఎప్పుడూ స్వస్తి పలుకుతారో అర్థం కావడం లేదు. చేపల పులుసు వండాలంటే భుజాన వలలు వేసుకునే తీరులో మన అధికారుల పనితీరు ఉంటోంది.**

మన వ్యవస్థలు ఎంత అధ్వాన్నంగా వున్నాయో, మన అధికార యంత్రాంగం ఎంత నిర్లిప్తంగా వుందో చూపేందుకు ఉదాహరణ మనుబోలు సమీపంలోని జాతీయ రహదారిపై వంతెనలే! గతేడాది నవంబర్‌లో రోవాన్ తుఫాన్ మూలంగా కురిసిన వర్షాల ధాటికి జిల్లాలో భారీ వరదలు వచ్చాయి. గూడూరు డివిజన్‌లో చెరువులన్నీ నిండిపోగా పలు చెరువులు తెగి గ్రామాలను, పొలాలను ముంచెత్తుతూ జాతీయ రహదారిని బలంగా తాకాయి. సాధారణంగా రైల్వే వంతెనలు వివిధ కాలువలు, నదుల వద్ద వందేళ్ల కాలం నాటి ప్రవాహాన్ని పరిగణనలోకి తీసుకుని కట్టి ఉంటారు. అదీగాక మన రైల్వే వంతెనలన్నీ కూడా దాదాపు బ్రిటీష్ వారి హయాంలో నిర్మించినవే! కాబట్టి నాణ్యతా ప్రమాణాలుంటాయి. భారీస్థాయిలో వరద లొచ్చినా వరద నీరు సాఫీగా పోయేంత ఎత్తులో రైల్వే వంతెనలుంటాయి. కాని రోడ్డు వంతెనలు అలా కాదు కదా! పనుల్లో నాణ్యత, భద్రత కంటే కూడా కమిషన్‌లు, లాభాలకే ప్రాధాన్యత ఉంటుంది. ఎవరు ఎక్కడ ఛస్తే మాకేంటి, టెండర్ వచ్చిందా, తూతూ మంత్రంగా పనిచేశామా, బిల్లులు వసూలు చేసుకున్నామా అన్నట్లుగా ఈ కాలంలో కాంట్రాక్ట్ పనులు జరుగుతుం టాయి. ఈ కోణంలో కట్టిన రోడ్డు వంతె నలు కాబట్టే నవంబర్‌లో వచ్చిన వరదల ధాటికి మనుబోలు – గూడూరుల మధ్య బద్దెవోలు వద్ద రెండు వంతెనలు తెగిపో యాయి. దీంతో అప్పుడు నాలుగురోజుల పాటు జాతీయ రహదారిపై రాకపోకలు స్థంభించిపోయి వేలాది వాహనాలు రోడ్ల మీదే నిలబడిపోవడం తెలిసిందే! హైవే మీద నిలిచిపోయి వాహనాలలో ఇబ్బంది పడుతున్న డ్రైవర్లు, సిబ్బంది, ప్రయాణీ కులకు నెల్లూరుజిల్లాకు చెందిన ఎన్నో స్వచ్ఛంధ సంస్థలు ఆహార పొట్లాలు, మంచి నీళ్లు అందించి ఆదుకోవడం తెలిసిందే! రవాణా శాఖ మంత్రి శిద్ధా రాఘవరావు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు నాలుగురోజుల పాటు ఈ వంతెనల వద్దే తిష్ట వేసి, చీమకుర్తి నుండి పెద్దఎత్తున బండరాళ్లను తెప్పించి, వరద ప్రవాహాన్ని నిలువరించి ఇరువైపులా తాత్కాలిక వంతెనల నిర్మాణం పూర్తి చేశారు. 8 నెలలుగా ఈ తాత్కాలిక వంతెనల మీదుగానే వాహనాల రాక పోకలు సాగుతున్నాయి. తెగిన వంతెనల స్థానంలో ఇంతవరకు పునర్నిర్మాణం చేపట్టలేదు. అప్పట్లో వంతెనలను పగుల గొట్టారని చెప్పి హైవే వాళ్లు ఈ వంతెనలు కట్టడానికి నిరాకరించారని, రాష్ట్ర ప్రభు త్వమే ఈ వంతెనలు కట్టుకోవాలని చెప్పి నట్లు సమాచారం. ఆరోజు ఈ వంతెనలు తెగిపోకుంటే చాలా గ్రామాలు మునిగి పోయే పరిస్థితి. మళ్ళీ వర్షాకాలమొస్తుంది. తాత్కాలిక వంతెనలు పటిష్టంగా లేవు. మొన్న వచ్చిన వరదల్లో పావువంతు వరదలొచ్చినా ఈ తాత్కాలిక వంతెనలు పుటుక్కున తెగిపోవడం ఖాయం. అలాంటివి జరగక ముందే హైవే అథారిటీ వాళ్లు మేల్కొని ఈ వంతెనల నిర్మాణం పటిష్టంగా చేపట్టాల్సి వుంది.

సింహపురి సమాచారం

## రాచాలపై హత్యాయత్నం



### • చెన్నై ఆసుపత్రిలో చికిత్స

మాజీ నెల్లూరు జడ్పీటీసీ సభ్యుడు రాచాల రవికుమార్ యాదవ్‌పై ఈ నెల 10వ తేదీ రాత్రి హత్యాయత్నం జరిగింది. ప్రస్తుతం అతని పరిస్థితి కుదుటపడ్డట్లు తెలుస్తోంది. ఆరోజు రాత్రి నెల్లూరులో పనులు ముగించుకుని కార్పొరేటర్ రాజానాయుడు కారులో ఆయన తన స్వగ్రామమైన బురాన్‌పూర్‌కు వెళ్లారు. కారులో దిగి ఇంటిలోకి వెళ్లబోతుండగా అక్కడే పొంచివున్న నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు రవికుమార్‌యాదవ్‌పై కత్తులతో దాడికి దిగారు. మెడ మీద, ముఖం మీద విచక్షణా రహితంగా పొడిచి పారిపోయారు. తీవ్ర గాయాలపాలైన రవికుమార్‌యాదవ్‌ను హుటాహుటిన సింహపురి ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లారు. గ్రామంలోని గొడవల మూలంగానే ఈ సంఘటన జరిగినట్లుగా భావిస్తున్నారు.

రాచాల రవికుమార్‌యాదవ్ తొలుత ఆనంకు ముఖ్యఅనుచరుడిగా ఉండేవాడు. 2000లో జరిగిన ఎన్నికల్లో నెల్లూరు రూరల్ జడ్పీటీసీగా గెలిచాడు. అప్పుడు రాచాలను జడ్పీ ఛైర్మెన్ చేసేందుకు ఆనం సోదరులు తీవ్రంగానే ప్రయత్నించినా, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి గండికొట్టి, మాగుంట అనుచరుడు పి.చెంచలబాబుయాదవ్‌ను జడ్పీ ఛైర్మెన్ చేయడం తెలిసిందే! కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం కూడా ప్రయత్నించారు. 2014ఎన్నికలప్పుడు తెలుగుదేశంపార్టీలో చేరి ఆదాల అనుచరుడిగా కొనసాగుతున్నారు.

## బాబు మాటలు.. నీటి మూటలు

### - తిరుపతి ఎంపి వరప్రసాద్ విమర్శ

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలను మోసపూరిత హామీ లతో ప్రజలను మభ్యపెడుతున్నారని తిరుపతి ఎంపి వరప్రసాద్ విమర్శిం చారు. ముఖ్యమంత్రి అస్తవ్యస్త విధానాలతో ప్రజలు ఎన్నో కష్టాలు పడుతున్నారన్నా రన్నారు. బుధవారం మండలకేంద్రమైన కోటలో వైఎస్సార్సీపి నియోజకవర్గ సమ న్వయకర్తగా నియమితులైన మేరిగ మురళి పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మేరిగ మురళికి అందరూ సహకరించి పార్టీని బలోపేతం చేసేందుకు కృషిచేయాలని ఆయన కోరారు. నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లా డుతూ, విభజన చట్టంలోని అంశాలను అమలుచేసేందుకు ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు కేంద్రంపై వత్తిడి తీసుకు రావడం లేదని, అధికారం కోసం ఎన్నో ఎత్తులు వేసి ప్రజలను మోసం చేశారని, ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో అన్నివర్గాల ప్రజలకు హామీలిచ్చి, ఆ హామీలు అమలుచేయకుండా ప్రజలను మోసగించిన ఏకైక ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడేనని విమర్శించారు. వైఎస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, నియోజక వర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు త్వరలో పాదయాత్రలు నిర్వహిస్తామ న్నారు. సమన్వయకర్త మేరిగ మురళి మాట్లాడుతూ, పార్టీకి అంకితభావంతో పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామ న్నారు. కోట ఎంపిపి నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్సీపి నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, నేదురుమల్లి పద్మనాభరెడ్డి, నాయకులు నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, సంపత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు ఈ కార్యక్ర మంలో పాల్గొన్నారు.

## పొగాకు రైతుల్లో ఆనందం

ఎట్టకేలకు డిసి పల్లిలో పొగాకు వేలం ఈ సారి ఎలాంటి ఆందోళనలు లేకుండా ప్రశాంతంగా జరిగింది. గతంలోకంటే తక్కువ కాలవ్యవధిలోనే వేలం పూర్తికావడంతో రైతులు, వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మర్రిపాడు మండలంలోని డి.సి పల్లిలో పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 2015-16 పంటకాలానికి పొగాకు వేలం నిర్వహించారు. నూరు రోజుల్లోనే ఈ వేలం పూర్తికావడం కూడా విశేషమే. ఎందుకంటే, గతంలో 170 రోజులు కూడా ఈ వేలం ప్రక్రియ జరిగేది. ఈసారి పొగాకు బోర్డు అధికారులు ముందుచూపు మేరకు వేలం త్వరితగతిన పూర్తయింది. ఈ వేలంలో మర్రిపాడు, ఆత్మకూరు, అనంతసాగరం, చేజర్ల, కలువాయి, పొదలకూరు, ఏఎస్ పేట, వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు, ఉదయగిరి మండలాల పరిధిలోని 2186 మంది రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకున్నారు. 24 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ వేలంలో 53,71,024 కిలోల పొగాకు అమ్ముడు కాగా, 57కోట్ల 28లక్షల రూపాయల దాకా వ్యాపారం జరిగింది. వేలం నిర్వహణాధి కారి మురళీధర్ ఆధ్వర్యంలో వేలం సజావుగా జరగడంతో రైతులు, వ్యాపార ప్రతినిధులు సంతోషించారు. ఈ కార్యక్రమంలో పొగాకు రైతుల సంఘం అధ్యక్షుడు మూలి వెంగయ్య, రైతు నాయకులు అరికట్ల జనార్దన్‌నాయుడు, రామచంద్రయ్యనాయుడు, కొల్లి శ్రీరాములు నాయుడు, ఐటిసి ప్రతినిధి శ్రీనివాసులు, జిపిఐ ప్రతినిధి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## తపాలా ద్వారా పుష్కర జలాలు

ఆగష్టు 12 నుండి 23వ తేదీ వరకు జరుగనున్న కృష్ణా పుష్కరాలను పురస్కరిం చుకుని భక్తులకు పుష్కర జలాలు అంద జేయడానికి తపాలా శాఖ సన్నద్ధంగా వుందని, నెల్లూరు డివిజన్ సూపరింటెం డెంట్ ఆఫ్ హెడ్ పోస్టాఫీసెస్ పి.విశ్వ నాథం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా నది ఘాట్‌ల వద్ద నుండి సేకరించబడి శుద్ధి చేయబడ్డ పవిత్ర పుష్కర జలాన్ని ఆగష్టు 13వ తేదీ వరకు భక్తులకు ఇళ్లకే బట్వాడా చేయనున్నట్లు తెలిపారు. అర లీటర్ బాటిల్ 30రూపాయలేనని, ఈ నెల 14 నుండి ఆగష్టు 5వ తేదీ వరకు భక్తులు తమ దగ్గరలోని పోస్టాఫీసులను సంప్ర దించి డబ్బులు కట్టి పుష్కరజలంను బుక్ చేసుకోవాలని ఆయన కోరారు. భారత తపాలా శాఖ కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని అందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఆగష్టు 13వ తేదీ నుండి భక్తులకు పుష్కర జలం బట్వాడా చేయడం జరుగుతుందన్నారు.

## ప్రపంచ దేశాల్లో శ్రీవారి వైభవం

### టిటిడి ఛైర్మెన్

శ్రీ వెంకటేశ్వరుడి వైభవాన్ని ప్రపంచంలోని అన్ని దేశాల్లో చాటేలా ప్రత్యేక కార్యక్ర మాలను చేపడుతున్నామని టిటిడి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి తెలిపారు. నెల్లూరుజిల్లా నాయుడుపేట మండలం పుదూరులోని కాత్యాయినీదేవి సమేత హనుమదీశ్వరస్వామి ఆలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అనంతరం దేవదేవేరులకు వస్త్రాలు సమర్పించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. జీర్ణోద్ధరణకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారిని ప్రపంచంలోని అన్ని దేశాల ప్రజలు అపారమైన భక్తి భావంతో కొలుస్తున్నారన్నారు. తాను ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన ఏడాదికాలంలో సామాన్య భక్తులు స్వామివారిని దర్శించుకునేలా ప్రత్యేక వసతులు కల్పించామన్నారు. రాజకీయాలకు అతీతంగా భక్తులందరికి సేవలు అందిం చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలనాయుడు, ప్రభాకర్‌నాయుడు, చెంచయ్య, కౌన్సిలర్ మునిగోపి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## హనుమదీశ్వరునికి కళ్యాణోత్సవం

నాయుడుపేట సమీపంలోని పుదూరు గ్రామంలో వెలసిఉన్న కాత్యాయినీదేవి సమేత హనుమదీశ్వరస్వామి కళ్యాణోత్సవం ఈ నెల 10న కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన కుంభాభిషేక, కళ్యాణోత్సవం వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన వితరణ జరిగింది. ఓసూరు అల్లెయ్య, పగడాల శివప్రసాద్, భార్గవ్‌శర్మ, అన్నపూర్ణమ్మ, రాజగోపాలరెడ్డి, సునందమ్మ, శేషగిరి, శంకరయ్య, నరసయ్య, సత్యనారాయణరెడ్డి, తిరుమలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఏబివిపి బంద్ ప్రశాంతం

ఉన్నత పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యాహక్కు చట్టం అమలు, కామన్ ఫీజు విధానం తదితర సమస్యలపై మంగళవారం ఏబివిపి ఆధ్వర్యంలో చేపట్టిన పాఠశాలల బంద్ ప్రశాంతంగా జరిగింది. అనంతరం నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లో రాస్తారోకో చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో పెద్దఎత్తున ఫీజులు వసూలు చేస్తున్నారని, పేదలకు కార్పొరేట్ వైద్యం అందడం లేదని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో కామన్ ఫీజు విధానాన్ని ప్రవేశపెట్టాలని ఏబివిపి కో-కన్వీనర్ కౌశిక్ ప్రభుత్వాన్ని కోరారు. గుర్తింపు లేని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ఖాళీగా వున్న పోస్టులను భర్తీ చేయాలని రేషనలైజేషన్ పేరుతో పాఠశాలలను మూసివేసే చర్యలు ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేంద్ర, నగర సంఘటనా కార్యదర్శి రాజేష్, నాయకులు బాబు, తేజ, నాగేంద్ర, భాస్కర్, శ్రీకాంత్, విఎస్‌యూ నాయకులు సాంబశివారెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంలో ప్రవేశానికి ఆహ్వానం

నెల్లూరు ఆటోనగర్‌లో వున్న ఏపి గురుకులంలో ప్రవేశానికి ముస్లిం మైనార్టీ విద్యార్థుల నుంచి ధరఖాస్తులను ఆహ్వానిస్తు న్నామని గురుకులం ప్రిన్సిపల్ కొండల రావు పేర్కొన్నారు. 5,6,7,8 తరగతులకు సంబంధించిన సీట్లు ఖాళీగా వున్నాయని, ఈ నెల 30వ తేదీలోగా విద్యార్థులు ధర ఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

## ఏపి డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్

# జాయింట్ డైరెక్టర్‌గా నెల్లూరీయుడు



ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్‌గా నెల్లూరు, మాగుంట లే అవుట్‌కు చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ తూమాటి శ్రీనివాసులురెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 13వ తేదీన జిఓ నెం.496ను జారీ చేసింది. ఆత్మకూరు మండలం బట్టేపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డి నెల్లూరు, విఆర్ లా కళాశాలలో న్యాయవాద పట్టా తీసుకుని 1981లో ఆత్మకూరులో లాయర్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. 1991 నుండి 1997 వరకు ఎక్సైజ్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. 1999 నుండి 2006 వరకు ఏసిబి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గాను, 2006-07ల మధ్య ఒంగోలులో సీనియర్ ఏపిపిగానూ సేవలందించారు. 2007 నుండి 2012 వరకు ఎస్సీ, ఎస్టీ ఫోర్స్ పిపిగాను, 2012 నుండి 2013 వరకు ఒంగోలు మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టు పిపిగాను పనిచేశారు. 2014 నుండి కడప జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్నారు. ఏపి పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. న్యాయవాద వృత్తిలో నెల్లూరుజిల్లా కీర్తిని చాటుతూ ప్రతిష్ఠాత్మక బాధ్యతలను చేపట్టిన శ్రీనివాసులురెడ్డికి 'లాయర్' అభినందనలు.



# సినారాకు గవర్నర్ ప్రశంస

నెల్లూరుకు చెందిన కవి, రచయిత, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు చిన్ని నారాయణరావును తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య అభినందించారు. ఈ నెల 12వ తేదీన చిన్ని నారాయణరావు చెన్నైలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ రోశయ్యను కలిసి తన కవితా సంపుటాలను అందజేశారు. నారాయణరావు రాసిన 'మాట' దీర్ఘకవితా సంపుటిని చదివిన రోశయ్య ఆయనను, ఆయనలోని రచనా ప్రతిభను ప్రశంసించారు.

# శ్రీసిటీ పరిశ్రమలకు అనువుగా కృష్ణపట్నం పోర్టు




సమావేశంలో ప్రసంగిస్తున్న అనిల్ యండ్లూరి

పరిశ్రమలకు అత్యంత అనువుగా కృష్ణపట్నం పోర్టు సేవలు లభిస్తున్నాయని, తమ సేవలు వినియోగించుకోవాలంటూ కృష్ణపట్నం పోర్టు కంపెనీ సిఇఓ, డైరెక్టర్ అనిల్ యండ్లూరి శ్రీసిటీ పరిశ్రమ యాజమాన్యాలను కోరారు. బుధవారం శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో పోర్టు యాజమాన్యం నిర్వహించిన శ్రీసిటీ కస్టమర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోర్టు సేవలను వివరించారు. రోడ్డు, రైలు కనెక్టివిటీ, తక్కువ ఛార్జీలు, నిర్ణీత సమయానికి సరఫరా ఇంకా పలు అంశాలు తమ ప్రత్యేకతలుగా ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో నేడు అత్యంత చెప్పుకోదగ్గ, ప్రకాశవంతమైన ప్రాజెక్టు లుగా శ్రీసిటీ, కెపిసిటీలను అభివర్ణించారు. ఈ రెండు ప్రాజెక్టులకు ఒకే పోలిక వుందన్నారు. రెండూ కూడా 8ఏళ్ళ క్రితం ప్రస్థానం ప్రారంభించి, ఎన్నో సవాళ్ళను ఎదుర్కొని ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులుగా ఎదిగాయన్నారు. అనంతరం కస్టమర్లు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశాడు. ఈ కార్యక్రమంలో సెజ్‌డెవలప్‌మెంట్ కమిషనర్ ఎస్‌కె సమల్, శ్రీసిటీ ప్రెసిడెంట్(వర్క్స్) సతీష్‌కామత్, శ్రీసిటీలోని పలు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



## వెంకయ్యకు...

# అభినందనల వెల్లువ

వరుసగా 4వసారి రాజ్యసభకు ఎంపిక కాబడిన వెంకయ్యనాయుడికి తన అభిమానులు, ఆప్తులు, ఆత్మీయుల నుండి అభినందనల పరంపర కొనసాగుతోంది. జాతీయ స్థాయిలో నాయకుడిగా ఎదిగి పల్లె నుండి ఢిల్లీ దాకా తన రాజకీయ ప్రస్థానాన్ని విజయపథంలో సాగిస్తున్న వెంకయ్యని ఆయన అభిమానులు ముందుగా విజయవాడలోనూ ఆ తరువాత హైదరాబాదులోనూ ఘనంగా సత్కరించారు. మీట్ & గ్రీట్ పేరుతో ఏర్పాటు చేస్తున్న ఆత్మీయ సమావేశాలలో ఆయన పాతమిత్రులను, ఆప్తులను కలుసుకుంటున్నాడు. ఇదే పరంపరలో జులై 10వ తేదీ బెంగుళూరులో ఆయనకు ఘనసత్కారం జరిగింది. జులై 17వ తేదీ ఆదివారం నాడు చెన్నైలోని లీలాప్యాలస్ హోటల్ మరో ఆత్మీయ సమావేశం జరగబోతోంది. చెన్నైలోని సౌత్ ఇండియన్ ఫిలిం ఛాంబర్‌తో పాటు పలువురు వెంకయ్య అభిమానులు ఆయన సత్కార అభినందన కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో యస్.పి.బాలసుబ్రహ్మణ్యంతో పాటు పలు సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులు పాల్గొననున్నారు.



ఇటీవల వెంకయ్యను కలిసి అభినందనలు తెలుపుతున్న కోవూరు వాస్తవ్యుడు, అనపల్లి కన్వెన్షన్ సెంటర్ అధినేత, వెంకయ్యకు చిరకాల మిత్రుడు అనపల్లి అశోక్‌రెడ్డి



బెంగుళూరులో వెంకయ్యనాయుడిని కలిసి అభినందించిన కర్ణాటక తెలుగుదేశంపార్టీ సమన్వయకర్త రావి మోహన్‌చౌదరి

# 'ఆటో వంశీ'కి విపిఆర్ వితరణ

## లక్ష రూపాయలు అందజేసిన ప్రశాంతిరెడ్డి

మానవత్వానికి, దయార్ద్ర హృదయానికీ నెల్లూరోళ్ళకు కొదవలేదనడానికి ఉదాహరణ వంశీ ఉదంతం. ప్రేమ పెళ్ళితో ఒక్కటై విధి ఆడిన వింత నాటకంతో ప్రమాదంలో గాయపడిన భర్తతో, ఇద్దరు బిడ్డలతో బ్రతుకుబండిని లాగిస్తున్న వంశీ కుటుంబానికి అండగా నిలవడానికి విపిఆర్ ఫౌండేషన్ ముందుకొచ్చింది. రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చొరవతో సింహపురి ఆసుపత్రిలో చికిత్స కోసం చేరిన వంశీని పరామర్శించిన విపిఆర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి ప్రశాంతిరెడ్డి 14వ తేదీ గురువారం ఉదయం లక్ష రూపాయలు విరాళాన్ని వంశీ చికిత్స నిమిత్తం ఆయన భార్య గీతకి అందజేశారు. స్థానిక టీవీలో వచ్చిన కథనానికి విశేషంగా స్పందిస్తున్న మానవతా హృదయాలకు 'లాయర్' వందనాలు.



# గడప గడపకు వైకాపా శ్రేణులు

2014 ఎన్నికల తర్వాత ప్రతిపక్ష నేతగా వై.యస్.జగన్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చిన రాష్ట్ర వ్యాప్త పార్టీ కార్యక్రమం 'గడప గడపకు వైయస్సార్ కాంగ్రెస్'. రెండేళ్ల చంద్రబాబు ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ఎత్తి చూపుతూ, చంద్రబాబు ఇచ్చిన హామీలను ఎలా విస్మరించారన్నది వివరిస్తూ, తెలుగుదేశం పాలనపై వంద ప్రశ్నలతో రూపొందించిన కరపత్రాలను ఇంటింటికి పంచుతూ 'గడప గడపకు వైయస్సార్ కాంగ్రెస్' కార్యక్రమం జిల్లాలో విజయవంతంగానే జరుగుతోంది. 2014 ఎన్నికలకు ముందు నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి 'గడప గడపకు వైయస్సార్ కాంగ్రెస్' పేరుతో పెద్దఎత్తున కార్యక్రమం నిర్వహించి, ఆనాడు జగన్ ప్రశంసలందుకున్నాడు. ఈరోజు అదే కార్యక్రమాన్ని జగన్ రాష్ట్రవ్యాప్తం చేశాడు. నెల్లూరు రూరల్‌లో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగుతోంది. నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్ అమెరికా పర్యటనలో ఉన్నందున, ద్వితీయ శ్రేణి నాయకుల ఆధ్వర్యంలో నగర నియోజకవర్గంలో, కావలిలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ సారధ్యంలో, ఆత్మకూరులో ఎమ్మెల్యే మేకపాటి గౌతం రెడ్డి ఆధ్వర్యంలో, సూళ్ళూరుపేటలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నాయకత్వంలో, సర్వేపల్లి నియోజకవర్గంలో పార్టీ జిల్లా కన్వీనర్, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి నాయకత్వంలో కార్యకర్తలు హుషారుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వెంకటగిరి, కోవూరు, గూడూరు నియోజకవర్గాలలో ఇన్‌ఛార్జ్ లుగా వ్యవహరిస్తున్న జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేరిగ మురళీధర్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోంది. ఎంపి మేకపాటి అన్ని నియోజకవర్గాల్లో కలయతిరుగుతున్నారు.

# జైనులకు అపోలో 'ప్రివిలేజ్' కార్డ్



నెల్లూరులో ఉండే జైనులందరికీ అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్ వారు రాయితీతో కూడిన వైద్యసేవలందించేందుకు 'ప్రివిలేజ్ కార్డ్'ను ప్రవేశపెట్టారు. బుధవారం జైన్ పూజ్య సాధ్వి శ్రీ ఆత్మ దర్శన శ్రీ జియం యస్ చేతుల మీదుగా ఈ కార్డును జైనులకు అందజేశారు. జైనులు ఇకపై చెన్నై వెళ్లే అవసరం లేకుండా నెల్లూరు అపోలోలోనే అత్యాధునిక వైద్యసేవలు పొందవచ్చునని, 24గంటలు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని అపోలో పిఆర్ఓ విజయకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జైన్ అసోసియేషన్ నాయకులు శాంతిలాల్ జైన్, విక్రమ్ జైన్, ప్రవీణ్ జైన్, అపోలో యూనిట్ హెడ్ నవీన్ పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

# కశ్మీరం.. కల్లోలం

**వేర్పాటువాదం, అవకాశవాదం.. ఉగ్రవాదం అన్నీ కలసి వెరసి ఇప్పుడు కశ్మీర్‌ను అల్లకల్లోలం చేస్తున్నాయి. మిలిటెంట్ల పట్ల అక్కడి ప్రభుత్వ మెతక వైఖరి, అవకాశవాద రాజకీయాలు కశ్మీర్‌ను భగ్గుమన్పిస్తున్నాయి. ఉగ్రవాదం, దానికి అనుకూలవర్గాలు చేస్తున్న ఆందోళనలతో కశ్మీర్ అట్టుడికిపోతోంది. అల్లర్లు..కర్ఫ్యూలతో ప్రజల బాధలు వర్ణనాతీతం. కశ్మీర్‌లో ఆ పరిస్థితులు మారాలి... కశ్మీర్‌లో శాంతి నెలకొనాలి. అందుకు ప్రభుత్వాలు, ప్రజాప్రతి నిధులు.. ప్రజలు అందరూ కంకణబద్ధులై సమిష్టి కృషి చేయాలి.**

మనం ఒకటి తలిస్తే..చివరికి మరోటి జరుగుతుందని, కాలం కలసిరాకపోతే తాడే పామై కాళ్ళకు చుట్టుకుంటుందని..నాటి పెద్దల మాటలు జ్ఞప్తికి వచ్చే సన్నివేశమిది. ఇప్పుడు కశ్మీర్‌లో బిజెపి పరిస్థితి చూస్తే అలాగే అనిపిస్తోంది. ప్రపంచం ఎదుర్కొంటోన్న రెండు ప్రధానమైన సమస్యల్లో ఉగ్రవాదం ఒకటని, మానవత్వాన్ని విశ్వసించే శక్తులన్నీ కలసికట్టుగా ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు ముందుకు రావాలని, ఉమ్మడి పోరుతోనే ఉగ్రవినాశనం జరుగుతుందని ప్రధాని మోడీ కెన్యాలో ప్రపంచ ప్రజలకు పిలుపునిస్తున్న వేళ, ఇక్కడ కశ్మీర్‌లో ఉగ్రవాదవర్గాలు..వారికి మద్దతు తెలిపే ఆందోళనకారులు అందరూ కలసి కశ్మీర్‌ను అల్లకల్లోలం చేస్తున్నారు. ప్రజాజీవితాన్ని నానా ఇక్కట్ల పాల్జేస్తున్నారు. ఎన్నికలప్పుడు ఏదో రాజకీయ సర్దుబాట్ల కోసమని పిడిపితో పొత్తు పెట్టుకున్న పాపానికి ఇప్పుడు లేనిపోని నిందలు..తలనొప్పులన్నీ భరించాల్సివస్తోంది బిజెపి. ఉగ్రవాద అనుకూలవర్గాల కొంగు పట్టుకుని తిరిగే పిడిపితో పొత్తు మంచిది కాదని బిజెపిలోని విజ్ఞులు అప్పట్లో మొత్తుకున్నా, తప్పనిసరి పరిస్థితుల్లో ఆపద్ధర్మానికన్నట్లు ఆ పార్టీతో కలిసినందుకు.. ఇప్పుడు బిజెపి లోలోపలే బాధపడాల్సి వస్తోంది. అయినా, ఇప్పుడు చింతించి ప్రయోజనం లేదు. ఎందుకంటే, కొన్ని భయంకర వాదాల్లో ఒక్కో సారి ఒక్క వాదంతోనే వేగలేం..అయితే, ఒకేసారి వేర్పాటువాదం, అవకాశవాదం, విషసర్పం వంటి ఉగ్రవాదం వగైరా దుష్టగుణాలన్నీ కలగలిస్తే చివరికి ఏమవుతుంది..అది కశ్మీర్ అవుతుంది. దానికి తోడు దుష్ప్రచారాలు కూడా కలిస్తే ఏమవుతుంది. అది.. కల్లోలం అవుతుంది. ఇప్పుడు సరిగ్గా కశ్మీర్ ఇలాంటి కల్లోలానికే గురవుతోంది. కశ్మీర్ ఇప్పుడెలా వుంది?.. భగ్గుమంటోంది. ఉగ్రవాది బుర్హానీ వానీ ఎన్‌కౌంటర్ అనంతరం జరిగిన ఆందోళనలు, కాల్పుల సంఘటనల్లో ఎంతో మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. రాజధాని శ్రీనగర్‌తో సహా పలు ప్రాంతాలు కర్ఫ్యూలో వున్నాయి. ప్రదర్శనకారుల ముసుగులో మిలిటెంట్ల దాడులు, పోలీసుల ప్రతిఘటనల్లో సుమారు 350 మందికి పైగానే గాయపడ్డారని అంచనా. జమ్ము-కశ్మీర్ రాజధాని శ్రీనగర్‌తో పాటు దక్షిణ కశ్మీర్‌లోని అనేక ప్రాంతాలు ఘర్షణలు, కాల్పులతో ఇంకా హోరెత్తిపోతున్నాయి. రాళ్ళు రువ్వడం, పోలీస్ స్టేషన్లకు నిప్పు పెట్టడం, ప్రభుత్వ వాహనాలను తగులబెట్టడం, ఎక్కడ చూసినా విధ్వంసకర ఘటనలతో కశ్మీర్ అల్లకల్లోలంగా వుంది. కారణాలు అనేకం. అక్కడి మిలిటెంట్ల పట్ల ప్రభుత్వం మెతకవైఖరి అవలంభించడమైతేనేమి, అవకాశవాద రాజకీయాలతో పాలన సాగుతుండడ వల్లనైతేనేమి, ఇదే అదనుగా ఉగ్రవాదశక్తులు పేట్రేగిపోవడంతో కశ్మీర్ అల్లకల్లోలంగా మారుతోంది. హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్ బుర్హాన్ వనీ అనే ఉగ్రవాదిని భద్రతాదళాలు మట్టుపెట్టడంతో చెలరేగిన అల్లర్లు అంతకంతకూ పెరుగుతూ కశ్మీర్‌లో భయానక పరిస్థితి ఏర్పడుతోంది. ఒకవైపు ఉగ్రవాదం ఇలా బుసలుకొడుతుంటే, మరోవైపు కశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ నేతృత్వంలోని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి) అవకాశవాద రాజకీయాలు మరింతగా పెరిగిపోయి కశ్మీర్‌లో అశాంతి వాతావరణానికి దోహదం చేస్తున్నాయనే విమర్శలూ లేకపోలేదు. ఉగ్రవాద అనుకూలవర్గాలను తమ పార్టీలో చేర్చుకోవడం ద్వారా పిడిపి అసెంబ్లీలో పెద్ద పార్టీగా అవతరించడం..ఆ వర్గాలకు ఊతంగా మారింది. దక్షిణ కశ్మీర్‌లోని అనేక ప్రాంతాలు ఇప్పుడు అలాంటి ఉగ్రవాద అనుకూల వర్గాలవారికి స్థావరాలు కావడమే అందుకు నిదర్శనంగా భావిస్తున్నారు. కశ్మీర్‌లో పిడిపి-బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అక్కడ మిలిటెంట్ల సంఖ్య బాగా పెరిగినట్లు కూడా అంచనా. ఈ ఉగ్రవాదులు కశ్మీర్‌లో నిరంతరం అశాంతిని సృష్టిస్తూ, భద్రతాదళాలకు సవాల్‌గా మారుతుండడంతో కేంద్రం జోక్యం తప్పడం లేదు. పరిస్థితి ఇలా చేయిదాటిపోతుండడంతో, కేంద్రం నుంచి బాగా వత్తిళ్ళు వచ్చేసరికి ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కఠినంగా వ్యవహరించాల్సి వస్తుండడంతో కశ్మీర్‌లో మరింతగా ఉద్రిక్తతలు చెలరేగుతున్నాయి. ఈ పరిస్థితి చివరికి ముఫ్తీకి అగ్నిపరీక్షగా మారుతోంది కూడా. రాష్ట్రానికి సాయంగా కేంద్రం సాయుధ దళాలను పంపుతున్నప్పటికీ అక్కడి పరిస్థితులు ఇప్పటికీ అదుపులోకి రావడం లేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా తయారైందో ఊహించుకోవచ్చు. ఉగ్రవాద అనుకూలవర్గాలవారిని కలుపుకున్న పిడిపితో పొత్తు చివరికి బిజెపికి కొరివితో తల గోక్కున్నంత పనైపోతోందనే అభిప్రాయాలూ ఆ పార్టీలోనే వెల్లువెత్తుతున్నాయి. ఏదేమైనా, ఇప్పుడు తక్షణం కశ్మీర్‌లో ప్రశాంత వాతావరణం ఏర్పడాలి. అందుకు అక్కడి ప్రజలే శాంతికి బాటలు వేసుకోవాలి. ప్రజాప్రతినిధులంతా ఏకమై ప్రశాంతతకు దారులు తీయాలి. ప్రభుత్వాలు అందుకు చేదోడుగా నిలవాలి. అయినా, ఏనాటికైనా ఉగ్రవాదం వీగిపోతుందని, మానవతావాదమే నిలచి గెలుస్తుందని చెప్పేందుకు కశ్మీర్‌లో కర్ఫ్యూ సందర్భంగా జరిగిన ఓ సంఘటనే ఉదాహరణ.

కర్ఫ్యూ వల్ల రెండు రోజులుగా తిండితిప్పలు లేక పస్తులతో బాధపడుతున్న పిల్లలు, వృద్ధురాలితో వున్న స్నేహంతో జుబేదా అనే మహిళ కర్ఫ్యూను సైతం లెక్కచేయకుండా జీలం నదికి ఆవల వున్న హిందువులైన తన స్నేహితుల కోసం అన్నం వండి, భర్తను తోడుగా తీసుకుని ఆ ఆహారపు బస్తాతో కర్ఫ్యూలోనే నడచి వెళ్ళి వారికి కడుపారా ఆహారం పెట్టి మానవత్వాన్ని, స్నేహధర్మాన్ని చాటుకుంది. ఆకలితో అల్లాడుతున్న 84 ఏళ్ళ ముసలితల్లికి కూడా ఆమె అన్నం పెట్టి మానవత్వపు జెండాను ఎగురవేసింది. మతానికి అతీతంగా మానవత్వం పరిమళించిన మహత్తర సన్నివేశమిది. మానవత్వం ముందు ఎంతటి బలమైన శక్తయినా... ఎలాంటి ఉగ్రవాదమైనా నీరసపడక తప్పదని, శాంతి- సహసనం-దయాగుణం పల్లవించే మానవత్వమే చివరికి జయపతాక ఎగురవేస్తుందని చెప్పేందుకు ఇంతకంటే చక్కని ఉదాహరణ ఇంకేముంటుందీ?..కశ్మీర్ అంతటా..అలాంటి మానవత్వం పల్లవించే రోజు త్వరలోనే..తప్పక వస్తుందనే ఆశిద్దాం!.... ఆరోజు కోసం వేచిచూద్దాం!

### విద్యార్థులకు...

## మహాయాగ పుస్తకాలు



నెల్లూరు మహాయాగ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ ఏసి నగర్ మునిసిపల్ నగరపాలక పాఠశాలలోని పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నీలి విజయకుమార్, మహాయాగ వాలంటీర్లు దీపక్, నిఖిలేష్, సంతోష్, మను, బాలిరెడ్డి, కిరణ్, వంశి, లోకేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## నేస్తం విద్యాసామాగ్రి



ప్రమాదవశాత్తు మెదడుకు గాయమై ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటూ చికిత్స చేయించుకోలేని స్థితిలో గత 9 నెలలుగా మంచానికే పరిమితమైన వంశీకృష్ణ కుటుంబాన్ని సోమవారం నేస్తం ఫౌండేషన్ సంస్థ పరామర్శించింది. ఈ సందర్భంగా సుదర్శన్ పెయింట్స్ గోవిందరాజు సహకారంతో బాధితుని పిల్లలకు విద్యాసామాగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు కోరెం ప్రవీణ్‌కుమార్, సుదర్శన్, శివ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు

## ప్రజల్లోకి తీసుకెళ్లాలి



బీజేపీ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్రరెడ్డి

కేంద్రప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి అన్నారు. ఈ నెల 9వ తేదీన నెల్లూరు బీజేపీ కార్యాలయంలో భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సురేంద్రరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సురేంద్రరెడ్డి మాట్లాడుతూ ఆగస్టు నెలలో శిక్షణా తరగతులు నిర్వహించాలని, అందుకోసం పార్టీని బూత్ లెవల్ నుంచి కమిటీలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా పార్టీని బలోపేతం చేయవచ్చన్నారు. ఈ నెల 20లోగా అన్ని మండలాల్లో మండల కార్యవర్గ సమావేశాలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఏర్పడిందని, ఇప్పటికే వైసిపి నుంచి వలసలు పెరిగాయని, కాంగ్రెస్ బలం తగ్గిపోయిందన్నారు. ఈ సమయంలో పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ శక్తివంతమైన పార్టీగా ఎదగాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కోరుకుంటున్నారని, అందుకోసం ప్రతి కార్యకర్త ఆ దిశగా పనిచేయాలని కోరారు. 2019 ఎన్నికల నాటికి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే విధంగా ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, మిడతల రమేష్, రాష్ట్ర కార్యదర్శి కాకు విజయలక్ష్మి, కాయల మధు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాలపై వివక్ష

చరిత్ర పుట్టినప్పటి నుండి హిందూ దేవాలయాల నిర్మాణం, విధ్వంసం జరుగుతూనే వున్నాయి. మత రక్కసులు రాక్షసత్వం ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఎన్నో చారిత్రాత్మక ఆలయాలను ముష్కరులు నామరూపాలు లేకుండా చేశారు. హిందూ దేవాలయాలపై వివక్ష ఎక్కువైంది. హిందూ పూజావిధానాలపైనే విమర్శలు చేస్తున్నారు. విజయవాడ ఆలయాల విధ్వంసంలో చంద్రబాబును ఔరంగజేబు పూనినట్లున్నాడు. దేవాలయాలను ధ్వంసం చేయించాడు. దేవాదాయ భూములను మింగేస్తున్నారు. వీరిని దేవుడు క్షమించడు.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## వంటేరు వదాన్యత ఆదర్శప్రాయం




కావలి మాజీ శాసనసభ్యులు, సేవాతత్పరులు వంటేరు వేణుగోపాలరెడ్డి వదాన్యత ఆదర్శప్రాయం. తమ తండ్రి స్వాతంత్ర్య సమరయోధులు వంటేరు వరదారెడ్డి పేరుతో ట్రస్టు ఏర్పాటు చేసి తాను చదువుకున్న జలదంకి మండలం బ్రాహ్మణక్రాక జడ్పీ హైస్కూలు విద్యార్థులకు ప్రతి సంవత్సరం వారి తండ్రి పేరుతో పదవతరగతిలో ఉత్తీర్ణులయిన వారందరికీ నగదు ప్రోత్సాహకాలిస్తున్నారు. వరదారెడ్డి పేరుతో గిరిజన కాలనీని నెలకొల్పి అక్కడి గిరిజనులకు ప్రతి సంవత్సరం నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నారు. కావలి ఎమ్మెల్యేగా వున్న కాలంలో కోట్లాదిరూపాయలు స్వీయ నిధులు ఖర్చుపెట్టి కావలిని ఎంతో అభివృద్ధి చేశారు. వారి సేవా కార్యక్రమాలు ఈనాటి ప్రజాప్రతినిధులకు ఆదర్శప్రాయం.

**ఎస్.బాబూరావు, కావలి.**

## ఎన్‌కౌంటర్‌లే పరిష్కారం

పట్టపగలు నెల్లూరు నగరం చిల్డ్రన్స్‌పార్క్ వద్ద జరిగిన దారుణం చూస్తుంటే తీవ్ర ఆందోళన కలుగుతోంది. ఓ నిందితుడు ఇంట్లోకి చొరబడి ఓ మహిళను పాశవికంగా హత్య చేయడం, ఇద్దరు చిన్నారులపై హత్యాయత్నం చేయడం... వినడానికే భయంకరంగా వుంది. ఇలాంటి నేరస్తుల వల్ల దేశానికి గాని, కన్న తల్లిదండ్రులకు గాని ఎటువంటి ఉపయోగం లేదు. ఇలాంటి వారిని జైళ్లలో పెట్టి మేపడం అనవసర ఖర్చు. ఎన్‌కౌంటర్‌లతోనే వీరికి సమాధానం చెప్పాలి. అప్పుడుగాని మిగతా నేరగాళ్లు అదుపులోకి రారు.

**సి.కొండారెడ్డి, నెల్లూరు.**

## కాశ్మీర్‌లో ఐసిస్ జెండాలా?

సైనిక దళాల ఎన్‌కౌంటర్‌లో ఒక ఉగ్రవాది చనిపోతే, అతడేదో దేశ స్వాతంత్ర్య సమరయోధుడైనట్లు కాశ్మీర్‌లో ఆందోళనలు చెలరేగడం దురదృష్టకరం. పాకిస్థాన్‌కు వత్తాసు పలుకుతూ పాక్‌జెండాలను, ఐసిస్ జెండాలను ఎగురవేయడం పరమ దుర్మార్గం. జవహర్‌లాల్ నెహ్రూ చేసిన తప్పిదాలకు ఈరోజు కాశ్మీర్ ఈ విధంగా తగలబడుతోంది. కాశ్మీర్‌లో పాక్ అనుకూల వాదాన్ని కఠినంగా అణచివేయాలి.

**పంచాల గురుమూర్తి, హైదరాబాద్.**

# నెల్లూరుపై నెత్తుటి మరక



***నెల్లూరుజిల్లా అంటే ప్రశాంతతకు మారుపేరు. రాజకీయ నాయకుల యాక్షన్ తప్పితే ఫ్యాక్షన్ వుండదు. రౌడీయిజం, నక్సలిజం వంటి వాటికి స్థానం లేదు. ఏపిలోని 13జిల్లాల్లోకల్లా ప్రభుత్వ అధికారులు ఒక్క ఏడాదైనా పనిచేయాలనుకునేది, పదవీ విరమణ తర్వాత కూడా శాశ్వతంగా నివాసం ఏర్పరచుకోవాలనుకునేది ఈ జిల్లాలోనే!***

అయితే ఇంతటి మంచి వాతావరణ మున్న జిల్లాలో కూడా అప్పుడప్పుడు అశాంతి, అలజడి రేగుతోంది. కిరాతక హత్యలు, భారీ దోపిడీలు జరుగుతుంటాయి. ఇలాంటివి జరిగినప్పుడు జిల్లా అంతటా ఉలిక్కిపడుతుంది. ఇలాంటిదే తాజాగా నెల్లూరులోని చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలో జరిగింది. ఆడిటర్ రామరాజు నాగేశ్వరరావు ఇంట్లోకి సీరియల్ కిల్లర్ కుక్కపల్లి వెంకటేష్ జొరబడి ఆయన భార్య ప్రభావతిని హత్య చేయడం, అక్కడేవున్న ఇద్దరు పిల్లలపై హత్యాయత్నం చేయడం భీతిగొలుపుతుంది. సమయానికి అక్కడికి వచ్చిన నాగేశ్వరరావు నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఇంటరాగేషన్ చేయడంతో కళ్లు తిరిగే నిజాలు బయటపడ్డాయి. జిల్లా పోలీస్‌శాఖకు సవాల్‌గా మారిన రెండు మిస్టరీ కేసులు ఈ సంఘటనతో ఛేధించారు. మార్చిలో కావలి పట్టణంలో పట్టపగలే ఓ మహిళను హతమార్చి దోపిడీకి పాల్పడింది ఈ వెంకటేష్ అనే క్రూరుడేనన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఇక నెల్లూరురూరల్ మండలం పెద్దచెరుకూరులో వృద్ధ దంపతులు చంద్రమౌళేశ్వరశాస్త్రి, పుష్పవేణిలను తల పగలగొట్టి చంపింది ఇతనేనని తేలింది. మొన్నటి సంఘటనలో ఈ నిందితుడు పట్టుబడకపోయివుంటే ఇంకెన్ని హత్యలు చేసేవాడో!

సమాజంలో నేరప్రవృత్తి ఇంతగా పెరగడానికి కారణమేంటన్నదానిపై విశ్లేషించాల్సి వుంది. వ్యసనాలకు అలవాటు పడిన యువకులు అడ్డదారి సంపాదన కోసం హత్యలు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. ఈమధ్య కాలంలో నెల్లూరుజిల్లాలో చాలామంది చైన్‌స్నాచర్లను పోలీసులు పట్టుకోవడం జరిగింది. పట్టుబడ్డవారిలో ఎక్కువమంది స్టూడెంట్సే! జల్సాలకు అలవాటుపడి పాకెట్‌మనీ చాలక ఇలా అడ్డదారులు తొక్కినవాళ్లే! సమాజంలో నేరప్రవృత్తి పెరగడానికి ప్రధానకారణం మీడియా కూడా! రాంగోపాల్‌వర్మ సినిమాలు చూసి తాను నేరాలకు పాల్పడినట్లు మొన్న చిల్డ్రన్స్ పార్క్ సంఘటనలో పట్టుబడిన నిందితుడు చెప్పడం జరిగింది. ఇక టీవీలలో వచ్చే సీరియల్స్‌లో హత్యలు ఎలా చేయాలి, ఎలా తప్పించుకోవాలి అన్నది ప్లాన్‌లు వేసి చెబుతున్నారు. ఇక క్రైం స్టోరీలు కామన్! మీడియాలో నేరప్రవృత్తిని ఒక హీరోయిజం మాదిరిగా చూపిస్తుండడం కూడా దుష్ప్రభావాన్ని కలిగిస్తోంది.

## పోలీస్ భయం లేకపోవడం

పబ్లిక్‌లో పోలీస్ భయం ఉంటే, నేరం చేస్తే శిక్ష గ్యారంటీ అన్న భయం ఉంటేనే నేరాలు చాలావరకు తగ్గుముఖం పడతాయి. ఇప్పుడు పబ్లిక్‌లో పోలీస్ భయం తగ్గింది. దీనికి కారణం రాజకీయ ఆధిపత్యమే! బాధితుల కంటే నిందితులకే రాజకీయ రక్షణ ఎక్కువగా వుంటోంది. ఈరోజు హత్యలు చేసిన వాళ్ళు నెల, రెండు నెలల తర్వాత మళ్ళీ బెయిల్ తెచ్చుకుని దర్జాగా వీధుల్లో తిరుగుతుంటారు. ఈ కేసులు కోర్టులో తుది విచారణకొచ్చేసరికి ఐదారేళ్లు పడుతుంది. ఈలోపు సాక్షులు, సాక్ష్యాలు మారిపోతాయి. నిందితులు శిక్షలు లేకుండానే బయటకొస్తుంటారు. మన దేశంలో నేరం చేసిన వాళ్లలో శిక్షలు పడేవారి కంటే తప్పించుకునేవారే అధికంగా ఉంటారనడంలో అతిశయోక్తి లేదు. కేసులు కోర్టుల దాకా వెళ్లడం కాదు... అసలు కిరాతక నేరాలకు కళ్ళెం వేయడం పోలీసు జమానాలోనే జరిగిపోవాలి. అరాచక శక్తులకు పోలీస్ అంటే భయం ఏర్పడాలి.

కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఎస్పీగా ఉన్నప్పుడు ఎర్రబాబు, నాటకరాణి మురళి అనే ఇద్దరు క్రిమినల్స్‌ను ఎన్‌కౌంటర్ చేసాడు. ఆ దెబ్బతో కరుడుగట్టిన నేరస్థులు కూడా వణుకుపుట్టి దారికొచ్చారు. ఆకురౌడీలు, చాకురౌడీలు బుద్ధిగా పనులు చేసుకోసాగారు. హంతకులకు, నేరస్థులకు పోలీసు లెవల్లోనే పనిష్మెంట్ వుంటే ఇలాంటి క్రూరనేరాలను అదుపు చేయవచ్చు.

# అక్కడో... ఇక్కడో తేల్చుకోండి

## - ప్రభుత్వ వైద్యులకు కోటంరెడ్డి హెచ్చరిక



నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి 11వ తేదీ నెల్లూరులోని పెద్దాసుపత్రి తనిఖీకి వెళ్లారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతిలతో సమావేశమయ్యారు. పెద్దాసుపత్రిలో పనిచేస్తున్నట్లుగా ప్రభుత్వం నుండి జీతాలు తీసుకుంటూ కార్పొరేట్ ఆసుపత్రుల్లో డాక్టర్లుగా పనిచేస్తే ఏ మాత్రం సహించబోనని ఆయన ఘాటుగా హెచ్చరించారు. ఇక్కడ వైద్యసేవలందించాలంటే అక్కడ మానుకోండి, అక్కడే పని చేయాలంటే ఇక్కడన్నా మానుకోండని నిర్మొహమాటంగా చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలకు దుమ్మాకొట్టి కార్పొరేట్ ఆసుపత్రులలో పనిచేసే వైద్యులను మీడియాను తీసుకెళ్లి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టిస్తానని ఆయన హెచ్చరించారు. ఆసుపత్రిలో అటెండెన్స్ కోసం ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ మిషన్‌లు పనిచేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దాసుపత్రికి కడుపేదరికంలో వున్న రోగులు వస్తుంటారని, అలాంటి వారికి మానవత్వంతో సేవలందించాలని కోటంరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, కార్పొరేషన్ విప్ బొబ్బల శ్రీనివాసయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి బిరుదవోలు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## ఉన్నదే నలుగురు...

# వారిలోనూ వర్గపోరే!

*'చింత చచ్చినా పులుపు చావదు' అన్న సామెత కాంగ్రెస్‌పార్టీలో నిజమవుతుంది. రాష్ట్రంలో ఆ పార్టీ చచ్చినా, చచ్చుబడిపోయినా, దాని వాసనగా వున్న వర్గపోరు మాత్రం సమసిపోవడం లేదు. పార్టీ అధికారంలో వున్నప్పుడు, లేదంటే ప్రతిపక్షంలో వున్నప్పుడు నాయకుల మధ్య వర్గపోరు సాధారణంగా వుండేది. కాని ఇప్పుడు ఆ పార్టీ రాష్ట్రంలో కమ్యూనిష్టుల కంటే హీనదశలో వుంది. అయినా వర్గపోరే!*


నెల్లూరుజిల్లాలో ఆ పార్టీకి ఉన్నదే నలుగురు నాయకులు. మళ్లీ వాళ్లలో కొట్లాట. ఈమధ్య పదవుల విషయంలో నాయకుల మధ్య విభేదాలొచ్చాయి. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి అయితే అసలు పార్టీతో సంబంధమే లేకుండా నెల్లూరులో హడ్కో నిధులపై ఉద్యమం చేస్తున్నాడు. జిల్లా కాంగ్రెస్‌పార్టీతో అతను అంటీముట్టనట్లుగా వున్నాడు. ఇటీవల నెల్లూరు నగర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా మేకల వంశీకృష్ణ (మిగతా 11వ పేజీలో)

# విఎస్‌యులో విద్యార్థుల ఆకలి కేకలు



మాపై కేసులు పెట్టొద్దంటూ సిఐ కాళ్ళు పట్టుకుంటున్న విద్యార్థులు

నిత్యం వివాదాలతో, విద్యార్థుల ఆందోళనలతో అట్టుడికిపోతున్న నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఇప్పుడు విద్యార్థుల ఆకలి కేకలతో దద్ధరిల్లుతోంది. యూనివర్శిటీ కళాశాలకు చెందిన హాస్టల్ మెస్‌ను వెంటనే ప్రారంభించాలని, వర్శిటీలోని కోర్సుల్లో అధ్యాపకులను వెంటనే పిలిపించాలని విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. ఈ నెల 12వ తేదీన విద్యార్థులు ఆందోళనను తీవ్రం చేస్తూ వర్శిటీ పరిపాలనా కార్యాలయం ముందు భైఠాయించారు. వైస్‌ఛాన్సలర్‌కు తమ సమస్యలు చెప్పుకుందామని ఎదురుచూశారు. అయితే ఆయన ఎంతసేపటికీ రాకపోవడంతో వర్శిటీ ఉద్యోగులను పరిపాలనా భవనంలోకి పోకుండా విద్యార్థులు అడ్డుకున్నారు. ఈ దశలో పోలీసులు వచ్చి జోక్యం చేసుకున్నారు. వైస్‌ఛాన్సలర్, రిజిస్ట్రార్‌లకు వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు. తాము ఆకలితో అలమటిస్తుంటే వి.సి, రిజిస్ట్రార్‌లు నియంతల్లా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు మండిపడ్డారు. డికెడబ్ల్యూ కళాశాలలో తాత్కాలిక వసతి పొందుతున్న వర్శిటీ విద్యార్థినులు సైతం తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళనకు దిగారు.

# శ్రీ షిర్డి సాయిబాబా గురుపూర్ణిమ మహోత్సవ ఆహ్వానము

నెల్లూరు, ట్రంకురోడ్డు, గాంధీనగర్‌లోని శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో సాయిబాబా **గురుపూర్ణిమ మహోత్సవాలు**

**తేది.19-07-2016 మంగళవారము నుండి తేది. 27-07-2016 బుధవారము వరకు జరుగును.**

తేది. 19.7.2016 మంగళవారం నుండి 25.7.2016 సోమవారము వరకు ప్రతి రోజూ ఉదయం 7-00గం.ల నుండి బాబా వారికి మహన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకములు, అష్టోత్తర సహస్ర పూజలు జరుగును. పై పూజలలో పాల్గొనదలచిన భక్తులు మందిర గుమస్తా వద్ద 75రూ/- చెల్లించి తగిన రసీదు పొంది పై పూజలలో పాల్గొని శ్రీ బాబా వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించ వలసిందిగా కోరుతున్నాము.

తేది. 19.7.2016 మంగళవారం నుండి 25.7.2016 సోమవారము వరకు ప్రతిరోజు ఉదయం 9.30 నుండి "శ్రీ షిరిడి సాయిబాబా సచ్చరిత్ర పారాయణము" జరుగును. పై దినములలో ప్రతిరోజూ సాయంత్రం గం.6-45ని॥ల నుండి సామూహిక లలితా సహస్రనామ పారాయణం జరుగును. తేది. 25.7.2016 సోమవారము సా॥ గం.7-00లకు శ్రీ బాబావారికి పుష్పయాగము జరుగును.

**నగరోత్సవం:**
తేది.26-7-2016
మంగళవారం
సా॥6.00గం.లకు
నగరోత్సవము జరుగును.

**అన్నదానం:** తేది.27-07-2016 బుధవారము మధ్యాహ్నం గం॥ 12-00లకు శ్రీ బాబా వారికి అత్యంత ప్రీతికరమైన అన్నదాన కార్యక్రమం జరుగును.

ఇట్లు: కార్యవర్గము

**శ్రీ షిర్డి సాయిబాబా మందిరం**

గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు. ఫోన్. 2327771.

# మైనర్... డేంజర్



హైదరాబాద్‌లో మైనర్లు మద్యం మత్తులో రాంగ్‌రూట్‌లో కారు తోలి రమ్య అనే చిన్నారి దీపాన్ని ఆర్పేసిన హృదయ విదారక ఘటన తెలంగాణలోనే కాదు ఆంధ్రా ప్రజల హృదయాలను కూడా కలచివేస్తుంది. ఎవరు చేసే తప్పుకు ఎవరు బలవుతున్నారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మద్యం మత్తులో విచ్చలవిడిగా వాహనాలు నడిపే మైనర్‌లు ఒక్క హైదరాబాద్‌కే పరిమితం కాలేదు. వెదికితే దేశం నిండా వున్నారు. మన నెల్లూరులోనూ ఉన్నారు. ఢిల్లీలో బస్సులోనే దారుణంగా అత్యాచారానికి గురైన నిర్భయ కేసులో అతి కిరాతకంగా వ్యవహరించినవాడు మైనరే! ఈ విషయాన్ని విస్మరించలేము. ఏడాదిన్నర క్రితం నెల్లూరు రూరల్ నరసింహకొండ అటవీ ప్రాంతంలో ఇంటర్మీడియట్ విద్యార్థి దొడ్డి బత్తిబాబును దారుణంగా హతమార్చింది సహ విద్యార్థులైన మైనర్‌లే! వీరంతా కూడా వ్యసనాలకు బానిసలైనవాళ్ళే!

ఇటీవలకాలంలో నెల్లూరు నగరంలో మైనర్లు స్పోర్ట్స్ బైక్‌లు, కార్లు అతివేగంతో నడుపుతున్నారు. ఇంట్లో అలిగో, బెదిరించో బైక్‌లు కొనిచ్చుకుంటారు. రోడ్ల మీదకొచ్చి సినిమాలలో హీరోల మాదిరిగా బైక్‌ను గాల్లోకి లేపడం, పడుతూ లేస్తూ తోలడం వంటి విన్యాసాలు చేస్తున్నారు. వీరి పిచ్చిచేష్టల వల్ల రోడ్ల మీద పోయే ఇతర వాహనదారులకు, పాదచారులకు పెద్ద ఇబ్బందవుతోంది. ట్రాఫిక్ రద్దీ వున్న రోడ్లలో కూడా 'రయ్'మని దూసుకుపోతూ మిగతా వాళ్ళు జడుసుకునేట్లు చేస్తున్నారు. ఈ మైనర్‌ల బైక్ విన్యాసాల వల్ల ఇటీవల నగరంలో పలు ప్రమాదాలు కూడా జరిగాయి. కొందరైతే బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా ఏర్పడి బీర్లు తాగుతూ బైక్‌రేస్‌లు నిర్వహించుకుంటున్నారు. పోలీసులు ఒక చూపు చూస్తేగాని వీళ్ళు ఒక దారికి రారు. మొక్కై వంగనిది మానై వంగునా? అని మనకు వేమన చెప్పి వున్నాడు కదా!

## కలామ్ స్ఫూర్తితో ముందుకు

- ఓఎస్డీ పెంచలరెడ్డి



భరతమాత ముద్దుబిడ్డ, మహా విజ్ఞానఖని అబ్దుల్ కలామ్ అందరికీ ఆదర్శప్రాయులని, ఆ మహనీయుని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు విద్యారంగంలో ముందుకు సాగుతూ మరెంతో ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఓఎస్డీ పెంచలరెడ్డి ఆకాంక్షించారు. నెల్లూరులోని మైథిలి స్కూల్ ఆధ్వర్యంలో లీడ్ ఇండియాలో భాగంగా కెటిఎస్ కళ్యాణ మండపంలో ఈ నెల 10న జరిగిన కార్యక్రమంలో ఓఎస్డీ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా లీడ్ ఇండియా ద్వారా చిన్నారులకు శిక్షణ ఏర్పాటు చేసిన మైథిలి స్కూల్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మైథిలి స్కూల్ కరెస్పాండెంట్ మనోహర్‌రెడ్డి, సీనియర్ డైరెక్టర్ రాధాకృష్ణమూర్తి, మాడరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి, శిక్షకులు నవీన్, అవిష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## చర్మవ్యాధులపై అవగాహన సదస్సు



నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్టేడియంలో చర్మవ్యాధులు, వాకింగ్‌పై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా డాక్టర్ సి.భాస్కరరావు పాల్గొని చర్మవ్యాధులు, వాటి నివారణను గురించి వివరించారు. వాకింగ్ చేసే సమయంలో కాళ్ళకు చెమట పడుతుందని, రోజూ సాక్సులను ఉతికి వేసుకోవాలన్నారు. ఎక్కువ చమట పట్టే ప్రాంతాల్లో ఫంగస్ చేరే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం బదిలీపై వెళ్ళనున్న డిఎస్‌డిఓ యతిరాజ్‌ను అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వేలూరు రంగారావు, కార్యదర్శి స్వర్ణా రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, డాక్టర్ సత్యనాథ్, నలుబోలు బలరామయ్యనాయుడు, డాక్టర్ దొరస్వామినాయుడు, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆశ్రమానికి వీధిబాలలు

నెల్లూరు నగరంలో భిక్షాటన చేస్తున్న పలువురు వీధి బాలలను ఐసిపిఎస్ అధికారులు ఈ నెల 9వ తేదీ పట్టుకున్నారు. పోలీసుల సహకారంతో ఆత్మకూరు బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, సంతపేట, కలెక్టరేట్ ప్రాంతం, రాజరాజేశ్వరి దేవస్థానం తదితర ప్రాంతాల్లో 14మంది వీధి బాలలను గుర్తించారు. వీరిలో 13మంది బాలికలు కావడం విశేషం. ఐసిపిఎస్ జిల్లా మేనేజర్ సురేష్ బాలలను ఆమ్మంచర్లలోని సత్యాగ్రహ ట్రస్టు ఆశ్రమానికి తరలించారు. బాలల సంరక్షణాధికారులు సమత, సుజాత, రత్నం పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు




## యం.జి.బి మాల్‌లో జన జాతర

నెల్లూరు దర్గామిట్టలో మెట్రోపాలిటన్ సిటీలకు ఏ మాత్రం తగ్గకుండా నిర్మించిన యం.జి.బి ఫెలిసిటీ మాల్‌లో ప్రతిరోజూ జాతర జరుగుతున్నట్లుగా జనం వస్తున్నారు. పెద్దపెద్ద నగరాలలో మాత్రమే వుండే మాల్స్ నెల్లూరులోనూ వెలవడం నెల్లూరీయులకు ఆనందాన్నిస్తుంది. యం.జి.బి మాల్ ఇప్పుడొక టూరిస్ట్‌స్పాట్‌గా మారింది. ఈ మాల్ ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. 5 సినిమా థియేటర్‌లు ఉన్నాయి. ఇవి పూర్తి కావడానికి ఇంకా కొంత సమయం పడుతుంది. బిగ్‌బజార్, రిలయన్స్ ట్రెండ్స్, మాక్స్, మెక్‌డోనాల్స్, క్రీమ్‌స్టోన్, బరిస్తా, ఇండియన్‌టెరైన్, నీరూస్ వంటి ఇంకొన్ని సంస్థలను, గేమ్స్ కోర్టులను మాత్రమే ప్రారంభించారు. మాల్ చూడడం కోసం జనం పెద్దఎత్తున వస్తున్నారు. ఎక్స్‌లేటర్‌లు ఎక్కే వద్ద అయితే జనాన్ని 'క్యూ'లో నిలబెట్టి పంపించాల్సి వస్తోంది. సెలవురోజులలో అయితే మాల్ వద్ద రద్దీ ఇంకా ఎక్కువగా వుంటోంది.

## పుష్కరాల బుకింగ్స్

నెల్లూరుజిల్లాలో అప్పుడే కృష్ణ పుష్కర ప్రయాణాల హడావిడి మొదలైంది. కృష్ణ పుష్కర స్నానానికి 90శాతం మంది విజయవాడ పోవాల్సిందే! పుష్కరం సమయంలో వాహనాల కొరత తీవ్రంగా వుంటుంది. ఆగష్టులో జరిగే పుష్కరాల కోసం అప్పుడే టెంపో, ఇన్నోవా వంటి అద్దె వాహనాలను బుక్ చేసుకుంటున్నారు. రైళ్ళలో టిక్కెట్లను ముందుగానే రిజర్వ్ చేసుకుంటున్నారు. గత ఏడాది గోదావరి పుష్కర సమయంలో నెల్లూరులో ట్రావెల్స్ ఏజన్సీల పంట పడింది. బాడుగలను అమాంతం పెంచేశారు. చంద్రబాబు పబ్లిసిటీ పుణ్యమా అని పుష్కరాలకు క్రేజ్ పెరగడంతో అద్దె వాహనాలకు డిమాండ్ ఎక్కువవుతోంది.

### ఇన్‌ఛార్జ్ డిపిఓగా
## మళ్ళీ రామిరెడ్డే!



జిల్లా పంచాయితీ ఇన్‌ఛార్జ్ అధికారిగా జడ్పీ సిఇఓ బి.రామిరెడ్డినే మళ్ళీ నియమించారు. ఇక్కడ డిపిఓగా వున్న సెల్విని తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ చేయడం తెలిసిందే! సెల్వి రాకముందు రామిరెడ్డి గతంలోనూ ఇన్‌ఛార్జ్ డిపిఓగా పని చేసివున్నారు.

## మళ్ళీ ఉక్కపోత

ఈమధ్య వాతావరణంలో చిత్రాతి చిత్రమైన మార్పులు జరుగుతున్నాయి. ఎండలూ... ఆ తర్వాత జల్లులు... కొన్ని రోజులు ఆకాశం మబ్బులు పట్టి ఉండడం... ఎండ కాసినరోజు ఉక్కపోత భరించలేనంతగా ఉంటోంది. రాత్రి వేళల్లో బలమైన గాలులు కూడా వీస్తున్నాయి. ఇది ఎండాకాలమో, వానాకాలమో తెలియడం లేదు.

### గ్రంథాలయ ఉద్యోగుల
## నూతన కార్యవర్గం

నెల్లూరుజిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఈ నెల9న ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎన్.శ్రీనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వి.నాగేంద్రరావు, కోశాధికారిగా జి.రవీంద్రన్ ఎన్నికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా ఎం. వెంకటేశ్వర్లరావు, ఎం.నరసింహరాజు, రేవతి, కార్యదర్శులుగా ఓ.శ్రీనివాసరాజు, ఎం.నరసింహరాజు ఎన్నికయ్యారు.

### పాఠశాలలు
## సెలవుల్లో నిర్వహిస్తే చర్యలు

ప్రభుత్వ సెలవు రోజుల్లో పాఠశాలలను నిర్వహించినా, నిర్ణీత సమయం కన్నా అధిక సమయం తరగతులు నిర్వహించినా ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి డిఇఓ విజయలక్ష్మీ పేర్కొన్నారు. ఈ విషయంపై డిప్యూటీ ఈఓలు, ఎంఇఓలు తమ పరిధిలోని అన్ని యాజమాన్య పాఠశాలలపై దృష్టి సారించాలని కోరారు.

## కోట రాజశేఖర్ అవధానికి సన్మానం



అల్లూరు నివాసి, అవధాన ప్రక్రియలో ఎంతో విశిష్టత సాధించిన కోట రాజశేఖర్ అవధానికి ఈ నెల 10 న హైదరాబాద్ త్యాగరాయ గానసభలో కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వాములవారి సమక్షంలో ఘన సన్మానం జరిగింది. ప్రముఖ రచయిత రాపాక ఏకాంబరాచార్యులు రచించిన 'అవధాన విద్యా సర్వస్వము' అనే బృహత్‌గ్రంథం ఆవిష్కరణ సభలో ఈ సన్మానం జరిగింది. దాదాపు ఏడువందల సంవత్సరాల కాలంలోని అవధానుల జీవితవిశేషాలతో, అవధాన పద్యాలతో, వివరణలతో రచింపబడిన ఈ పరిశోధన గ్రంథం ఎంతో చరిత్రాత్మకమైనది. అవధాన ప్రక్రియకు సంబంధించి ఎన్నో విశేషాలు, ఎందరో అవధానుల జీవిత విశేషాలను ఈ గ్రంథంలో గ్రంథస్థం చేశారు. సారస్వతాభిమానులకు, అవధానులకు, అవధాన ప్రక్రియపట్ల అభిరుచి వున్నవారికి ఈ గ్రంథం కరదీపిక అనవచ్చు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఐవైఆర్ కృష్ణారావుకు ఈ గ్రంథాన్ని అంకితం చేశారు. 11 వందల పేజీలున్న ఇంతటి బృహత్ గ్రంథాన్ని శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వాములవారు ఆవిష్కరించగా, బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ అధ్యక్షత వహించారు. ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వీరందరి సమక్షంలో అవధాని కోట రాజశేఖర్‌కు ఘనసన్మానం జరగడం ఎంతో విశేషం. నెల్లూరుజిల్లా అల్లూరులోని రామకృష్ణ విద్యాసంస్థల్లో సంస్కృత ఉపన్యాసకునిగా పనిచేసి ఇటీవలే రిటైర్, ప్రస్తుతం పడుగుపాడులో నివాసం వున్న కోట రాజశేఖర్ అవధాని జీవిత విశేషాల గురించి ఈ గ్రంథంలో ఆరు పేజీలలో వివరించివుండడం విశేషం.. ఏదేమైనా, ఎంతో కష్టసాధ్యమైన అవధాన ప్రక్రియలో పరిణతి సాధించి, మంచి కీర్తిప్రతిష్ఠలు తెచ్చుకుని ఆ ప్రక్రియలో నెల్లూరుజిల్లాకు మరింత ఖ్యాతి తెస్తున్న అల్లూరీయుడు కోట రాజశేఖర్‌కు 'లాయర్' అభినందనలు.



సమీక్షా సమావేశంలో వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ యం.జానకి

# పెద్దాసుపత్రిని గాడిలో పెడతా

జిల్లా కలెక్టర్ యం.జానకి ఈనెల 12వతేదీన నెల్లూరులోని ఏ.సి.సుబ్బారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీ కాన్ఫరెన్స్ హాల్‌లో పెద్దాసుపత్రి మరియు మెడికల్ కాలేజీ నిర్వహణకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. హాస్పిటల్ అభివృద్ధికి నిర్దేశించిన పనులను తొందరగా పూర్తిచేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు శ్రద్ధచూపాలని ఆమె కోరారు. ఆసుపత్రి, కాలేజీ ఆవరణలో పారిశుద్ధ్యం బాగుండాలని, పారిశుద్ధ్య సూపర్‌వైజర్లు, సిబ్బంది జాబితాను ఆన్‌లైన్‌లో వుంచి బయోమెట్రిక్ విధానం ద్వారా సిబ్బంది హాజరు, విధులను పర్యవేక్షించాలని ఆమె సూచించారు. పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవని గట్టిగానే చెప్పారు. ఆవరణలో ఎలుకలు, కుక్కలు, పందులు లేకుండా చేయాలన్నారు. ఆసుపత్రిలోని డాక్టర్లు నిబద్ధతతో వైద్యసేవలు అందించాలని కోరారు. ఆసుపత్రి, మెడికల్ కాలేజీలో అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బందిని పూర్తిస్థాయిలో ఏర్పరచుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రభు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఒట్టూరు సంపత్‌రాజు, అనిల్ కుమార్‌రెడ్డి, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వరసుందరం, డాక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.

# కృష్ణపట్నం పోర్టుకు గౌరవ పురస్కారాలు




నెల్లూరుజిల్లా అభివృద్ధికి వేదికగా నిలిచిన కృష్ణపట్నం పోర్టు పర్యావరణం, ఆరోగ్యం మరియు భద్రతా విషయాలలో అత్యున్నత ఫలితాలు సాధించినందుకుగాను 2015–16 సంవత్సరానికి రెండు అత్యున్నత గౌరవపురస్కారాలను అందుకుంది. ఈ నెల 9వ తేదీన చెన్నైలో జరిగిన కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సిఐఐ) సదస్సులో పోర్టు ముఖ్య కార్యనిర్వహణాధికారి నిమ్మగడ్డ జితేంద్ర ఈ పురస్కారాలను అందుకున్నారు. పర్యావరణం, ఆరోగ్యం, భద్రతలో '4స్టార్ రేటింగ్' అవార్డ్‌ను, ఇన్‌ఫ్రాస్టక్చర్ విభాగంలో మొదటి స్థానం పురస్కారాన్ని పోర్టు సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా నిమ్మగడ్డ జితేంద్ర మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టు పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యర్థాల నియంత్రణ, కాలుష్య నియంత్రణ, నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యతనిస్తుందన్నారు. కోటి మొక్కలు నాటడాన్ని లక్ష్యంగా పెట్టుకుని 26లక్షల మొక్కలు నాటామని, పవనశక్తిని ఉపయోగిస్తూ పునరుత్పాదక ఇంధన వినియోగంను 60శాతంకు పెంచామని తెలిపారు. మరుగునీటిని యంత్రాల ద్వారా శుద్ధి చేసి మొక్కల పెంపకానికి వాడుతున్నామని, వర్షపు నీటిని పొదుపు చేయడం, మడ అడవులను సంరక్షించడం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు.

# హడ్కో అప్పుపై కేతంరెడ్డి 'పోరుబాట'



నెల్లూరు నగరంలో 1100కోట్ల హడ్కో అప్పుతో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైపు లైన్ల పనులను వ్యతిరేకిస్తూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతంరెడ్డి వినోద్ రెడ్డి నగరంలో 'పోరుబాట'ను ప్రారంభించాడు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఆయన తిరుగుతూ ఈ అప్పువల్ల ప్రజలపై పడే భారం గురించి వివరిస్తున్నాడు. నెల్లూరు ప్రజలను తాకట్టుపెట్టి, వాస్తవాలను దాచిపెట్టి లేని గొప్పల కోసం ఈ అప్పు చేస్తున్నారని, దీనిని చెల్లించడానికి ప్రజలపై అదనపు పన్నుల భారాన్ని మోపనున్నారని ఆయన గడప గడపకు వెళ్ళి వివరిస్తున్నాడు. వినోద్ పోరుబాటకు నగర ప్రజల నుండి ఊహించిన విధంగా స్పందన కనిపించింది.

# మనిషి కాదు... మృగం





విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ

నెల్లూరు, చిల్డ్రన్స్‌పార్క్ ప్రాంతంలోని ఆడిటర్ రామరాజు నాగేశ్వరరావు ఇంటిలో ఘాతుకానికి పాల్పడిన హంతకుడు కుక్కపల్లి వెంకటేశ్వర్లు నేరచరిత్ర వింటుంటే ఒళ్లు గగుర్పాటు చెందుతుంది. వీడు మనిషి రూపంలో వున్న మృగం అని తేటతెల్లమవుతుంది. ఈ నెల 8వ తేదీన ఈ హంతకుడు చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలోని కృష్ణమందిరం రోడ్‌లో నాగేశ్వరరావు ఇంటి వద్ద రెక్కీ నిర్వహించాడు. ఇంట్లో మగవాళ్లు లేని సమయంలో డిష్ సెటప్ బాక్స్ రిపేరు పేరుతో నాగేశ్వరరావు ఇంట్లోకి ప్రవేశించాడు. రిపేరు చేస్తున్నట్లు నటిస్తూ తన వద్ద వున్న సుత్తితో మొదట ప్రభావతమ్మ(54) తలపై బలంగా కొట్టి చంపాడు. ఆ అలికిడికి లోపల వున్న ఆమె సోదరి పిల్లలు అనంతకృష్ణ, మాధురిలు అక్కడకు రాగా వారిని కూడా సుత్తితో కొట్టి గాయపరిచాడు. మాధురి అయితే తనను కొట్టొద్దని వేడుకున్నా ఈ క్రూరుడు కరుణించలేదు. ఇంటిలోనే ఆ పాపను తరిమితరిమి సుత్తితో దాడి చేశాడు. ప్రభావతమ్మను చంపి, పిల్లలిద్దరిని గాయపరచి, నిందితుడు నగలు దొంగలించిపోతుండగా అప్పుడే నాగేశ్వరరావు ఇంటి కొచ్చాడు. నాగేశ్వరరావు మీద కూడా వెంకటేష్ దాడికి దిగాడు. నాగేశ్వరరావు ఎదిరించి నిందితుడిని పట్టుకుని కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లొచ్చి ఈ నీచుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

పోలీసుల విచారణలో ఈ దుర్మార్గుడు చేసిన మరో రెండు దారుణాలు బయట పడ్డాయి. మార్చి 4వ తేదీన కావలిలోని ఊరి చివర వున్న అరటితోటలోని ఇంటిని ఎంచుకుని, ఆధార్‌కార్డ్ వెరిఫికేషన్ పేరుతో ఆ ఇంటిలోకి ప్రవేశించాడు. అదునుచూసి అక్కడే వున్న కవితను సుత్తితో అతి దారుణంగా కొట్టి హతమార్చాడు. కవిత అత్త సుశీలమ్మను, పిల్లలు దీక్షిత్, వశిష్టలను కూడా సుత్తితో కొట్టి గాయపరిచాడు. వారింట్లో వున్న నగలను ఎత్తుకెళ్లాడు. ఈ కేసు కావలిలో పెద్ద సంచలనంగా మారింది. ఈ కేసులో పోలీసులకు ఆధారాలు కూడా లభించక ఈ దారుణం ఎవరు చేసుంటారన్నది మిస్టరీగా మారింది. చివరికి ఈ కేసులో అసలు నిందితుడు వెంకటేష్ అని తేలేసరికి పోలీసులే నివ్వెరపోయారు.

ఇక ఏప్రిల్ 1వ తేదీ నెల్లూరు రూరల్ పెద్దచెరుకూరులోని శివాలయం పూజారి దంపతులు నూతలపాటి చంద్రమౌళీశ్వర రావు, పుష్పవేణిలను అతిదారుణంగా చంపింది కూడా ఈ రాక్షసుడే! గుడికి వచ్చిపోతూ వీరితో పరిచయం పెంచుకున్నాడు. ఆయనకు శిష్యుడిగా వున్నట్లు నటించాడు. వాళ్ల ఇంట్లోకి కూడా వెళ్లేవాడు. రాత్రిళ్లు వారితోపాటు టీవీలో ప్రోగ్రామ్‌లు చూసేవాడు. సంఘటన జరిగిన రోజు రాత్రి 10.30గంటల దాకా వారితో పాటు ఈటీవీలో కార్యక్రమాలు చూసాడు. ఇక కార్యక్రమాలు ముగిసే సమయంలో వారిద్దరిని సుత్తితో దారుణంగా కొట్టి చంపాడు. ఆమె వద్ద వున్న 3సవర్ల బంగారు సరుడును దొంగలించుకుని వెళ్లాడు. ఎవరితో ఎటువంటి వివాదాలు లేని పూజారి దంపతులు ఇంత దారుణ హత్యకు గురికావడం గ్రామంలో తీవ్ర ఆందోళన రేకెత్తించింది. చాలా రోజులైతే గ్రామస్తులు భయం గుప్పిట్లో బతికారు. గ్రామంలో పోలీస్ పికెట్‌ను పెట్టాల్సి వచ్చింది. ఈ సంఘటనలో ఆధారాలు దొరక్క పోలీసులు సైతం తల పట్టుకున్నారు. ఎట్టకేలకు హంతకుడు పట్టుబడడంతో ఈ కేసుల చిక్కుముడులు వీడాయి.

# లెక్కలు చూడండి.. బొక్కలు వెతకండి

- హాట్‌హాట్‌గా కార్పొరేషన్ స్టాండింగ్ కమిటి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ అబ్దుల్ అజీజ్

నెల్లూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటి సమావేశం ఈ నెల 11వ తేదీన రసవత్తరంగా జరిగింది. మేయర్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు కిన్నెరప్రసాద్, దాసరి రాజేష్, అంచూరు జానకి, వహీద, దొడ్డపనేని రాజాలు పాల్గొన్నారు. అజెండాలోని అంశాలను మేనేజర్ రాజేంద్ర చదవగా పలు అంశాలపై సభ్యులు కిన్నెరప్రసాద్, దాసరి రాజేష్‌లు గట్టిగా నిలదీసారు. అజెండాలో 42అంశాలుండగా రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో రిజర్వ్‌స్థలం 18సెంట్లను ఆసుపత్రి నిర్మాణం కొరకు స్వర్ణభారత్ ట్రస్ట్ వారికి అప్పగించాలన్న అంశాన్ని కౌన్సిల్‌లో ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. మిగతా అంశాలను ఆమోదించారు. నగరపాలక సంస్థకు సంబంధించిన న్యాయసంబంధ వ్యవహారాలను చూసేందుకు న్యాయవాదిగా నన్నేసాహెబ్‌ను ఎంపిక చేయడంపై కిన్నెరప్రసాద్ అభ్యంతరం వ్యక్తం చేసారు. తమను సంప్రదించకుండా ఏకపక్షంగా ఈ నిర్ణయం ఎలా తీసుకుంటారని ప్రశ్నించాడు. 12అంకణాలలోపు ఇళ్లు లేదా 300 రూపాయలలోపు ఇంటి పన్ను వున్న వాళ్లకే బిపిఎల్ కనెక్షన్‌లు ఇవ్వాలని తీర్మానించారు. నగరపాలక సంస్థలో అర్హతలేని కంప్యూటర్ ఆపరేటర్లున్నారని, అర్హులైన వారిని నియమించాలని సభ్యులు సూచించారు. అలాగే పారిశుద్ధ్య కార్మికుల పనితీరుపై కూడా సభ్యులు నిలదీశారు. తాగునీటి ట్యాంకర్ల లోనూ అవినీతి జరిగిందని సభ్యులు ఆరోపించారు. సమావేశానికి కమిషనర్ వెంకటేశ్వర్లు, ఇఇ ఆసిఫ్, హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, టిపిఓ సుధాకర్ తదితరులు హాజరయ్యారు.






# గూడూరు డివిజన్ వార్తలు

## అంతర్ పాఠశాలల క్రీడాపోటీలు




మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ప్రక్కన గోపాలరావు, హరిచంద్రారెడ్డి తదితరులు

గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహించ తలపెట్టిన అంతర్ పాఠశాలల క్రీడాపోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు ఉత్సాహంగా క్రీడాపోటీల్లో తలపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆ క్లబ్ అధ్యక్షులు నాగసూరి గోపాలరావు, కార్యదర్శి హరిప్రసాద్, శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు కనుమూరు హరిశ్చంద్రారెడ్డి, రొటేరియన్ జానకిరామిరెడ్డి, కె.మునిగిరీష్ తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్‌కు వినతులు



అర్జీలను స్వీకరిస్తున్న గూడూరు తహశీల్దార్ సత్యవతి

గూడూరు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన అర్జీదారులు తమ సమస్యలపై గూడూరు తహశీల్దార్ సత్యవతికి వినతి పత్రాలు అందజేశారు. ఆమె ప్రజాసాధికార సర్వేపై విఆర్వోలతో సమీక్షించారు.

## గడపగడపకు వైకాపా

గూడూరు పట్టణంలోని 32, 33వ వార్డుల్లో ఆదివారం నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీ ఆధ్వర్యాన నాయకులు గడపగడపకు వైకాపా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదప్రజల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వై.గోపాల్‌రెడ్డి, నాశిన నాగులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, మెట్టు రాధాకృష్ణారెడ్డి, మగ్దూమ్, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త మేరిగ మురళీ

## వృద్ధులకు రోటరీ హెల్పేజ్



వృద్ధులకు ఫలసరుకులను అందజేస్తున్న గోపాలరావు, రొటేరియన్లు

గూడూరు పట్టణంలోని మఠంవీధిలో ఉన్న అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ భవనంలో ఆదివారం రోటరీ హెల్పేజ్ పథకం కింద వృద్ధులకు ఫలసరుకులను పంపిణీ చేశారు. నిరాదరణకు గురైన వృద్ధులను గుర్తించి ప్రతి నెలా క్రమం తప్పకుండా ఈ క్రతువును కొనసాగిస్తున్నామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎన్.గోపాలరావు తెలిపారు. చెన్నై ప్రాంతానికి చెందిన వైద్యుడు సీతారాం ఆయన సతీమణి జ్ఞాపకార్థం సంచులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ క్లబ్ కార్యదర్శి హరిప్రసాద్, రొటేరియన్లు జానకిరామిరెడ్డి, కె.మునిగిరీష్, మయూరి శ్యాంయాదవ్, నాగేంద్రప్రసాద్, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ అవగాహన సదస్సు





సదస్సులో మాట్లాడుతున్న డా॥ సి.జనార్ధన్‌రెడ్డి

ఈ నెల 12వ తేదీన గూడూరులోని ద్వారకామాయి ఫంక్షన్ హాల్‌లో రోటరీ క్లబ్ మరియు ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు అపోలో హాస్పిటల్స్ సౌజన్యంతో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు జరిగింది. ప్రముఖ వైద్యులు డా॥ సి.హరితారెడ్డి క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, నిర్ధారణ, నివారణా చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డా॥ సి.రోహిణి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డి, డా॥ సి.జనార్ధన్ రెడ్డి, కె.మునిగిరీష్, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, దశరథరామిరెడ్డి, రోటరీ అధ్యక్షులు నాగసూరి గోపాలరావు, కార్యదర్శి హరిప్రసాద్, వెస్ట్ రోటరీ క్లబ్ అధ్యక్షులు శేగు శ్రీనివాసులు పాల్గొన్నారు. ఏరియా ఆసుపత్రిలో చాలాకాలంగా వైద్యసేవలందిస్తున్న డాక్టర్లు రామసుబ్బారెడ్డి, రాజా, పద్మావతిలను సత్కరించారు.











## 'సూక్ష్మ కళా' సారథి.. పార్థసారథి







### • అంతర్జాతీయస్థాయిలో అనేక అవార్డులు

*సూక్ష్మ కళారూపాలను సృజించడంలో అపారమైన ప్రజ్ఞాపాటవాలు పార్థసారథి సొంతం. సమాజ చైతన్యమే పరమావధిగా ఆయన రూపొందించిన ఎన్నో సూక్ష్మ కళారూపాలు ప్రజలు, ప్రముఖుల ప్రశంసలు అందుకుంటున్నాయి. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ వరల్డ్, అమెజాన్ వరల్డ్, జీనియస్, మిరాకిల్ తదితర అంతర్జాతీయ సంస్థలు ఆయన ప్రతిభను మెచ్చుకున్నాయి. ఆయన అద్భుతంగా రూపొందించిన ఈఫిల్ టవర్ నమూనా ఇటీవలే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా నమోదైంది. ఆ కళాకారుడు ఒక ఉపాధ్యాయుడు కావడం మరింత విశేషం. ఆయన పేరే.. పార్థసారథి.*

అటు విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే.. మరోవైపు తన అమోఘమైన కళాప్రతిభతో సామాజిక అంశాలను సూక్ష్మ కళారూపాలుగా తీర్చిదిద్దుతూ అందరి ప్రశంసలూ అందుకుంటున్నారు కావడి పార్థసారథి. నెల్లూరుజిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెంలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పార్థసారథి చిత్తూరుజిల్లాలోని రేణిగుంటలో నిరుపేద కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు సీతమ్మ-గురవయ్య. వీరికి పార్థసారథి ఒక్కరే సంతానం. జీవనోపాధి కోసం బుచ్చిరెడ్డిపాళెంకు వచ్చిన వీరు, వెదురుబుట్టలు అల్లుకుని జీవనం సాగిస్తూ, కుమారుడిని ఎంతో కష్టపడి ఉన్నత చదువులు చదివించారు. అందుకు తగ్గట్టుగానే పార్థసారథి కూడా కష్టపడి చదువుకుని టిటిసి పూర్తిచేసి 2000వ సంవత్సరంలో ఉపాధ్యాయునిగా ఉద్యోగం పొందారు. సంగంలో పనిచేసి, ఇప్పుడు బుచ్చిలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు.

### చిన్నతనం నుంచే కళారూపాలపై ఆసక్తి :

పార్థసారథికి చిన్నతనం నుంచి కళారూపాలపై ఎంతో ఆసక్తి వుండేది. ఆ ఆసక్తే ఇప్పుడాయన్ను ఓ మంచి సూక్ష్మ కళాకారునిగా ప్రఖ్యాతిలోకి తెచ్చింది. 2012లో తిరుపతిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలను పురస్కరించుకుని తమ పాఠశాలలో తొలిసారిగా రాష్ట్రీయ చిహ్నమైన పూర్ణకుంభాన్ని 10 వేల అగ్గిపుల్లలతో అత్యద్భుతంగా రూపొందించి అందరి మన్ననలు అందుకున్నారు. అంతేకాదు, ఈ కళారూపానికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, జీనియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, అమేజింగ్ వరల్డ్ రికార్డ్, ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ తదితర ప్రతిష్టాత్మక అవార్డులు లభించడం విశేషం. అదేవిధంగా, ఆయన వెదురుపుల్లలతో రూపొందించిన 10 అడుగుల ఈఫిల్ టవర్ కళారూపానికి ఎంతో విశిష్టమైన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ లభించింది. నూరు స్కూటర్ చైన్‌లను ఉపయోగించి రూపొందించిన శివలింగం, బియ్యపు గింజలతో రూపొందించిన శివపార్వతుల రూపాలు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు చేసుకున్నాయి. ఇలా ఎన్నో కళారూపాలు, సూక్ష్మ కళారూపాలకు ఆయన జీవం పోశారు. దాదాపు 63 కళాఖండాలను తన ప్రజ్ఞాపాటవాలతో రూపుదిద్దారు.

### ఎన్నెన్నో అద్భుత కళారూపాలు :

అగ్గిపుల్లలు, పూసలు, బియ్యం, మైనం, చాక్‌పీసులు, పెన్సిళ్లు వంటి చిన్న చిన్న వస్తువులనే ఉపయోగిస్తూ అందరూ ఆశ్చర్యపోయే రీతిలో ఎన్నో రకాల అత్యద్భుత కళారూపాలు సృష్టించడంలో దిట్టగా పార్థసారథి పేరు తెచ్చుకున్నారు. అంతేకాదు, సామాజిక చైతన్యంతో ప్రజలను మరింత చైతన్యవంతం చేయాలనే తపనతో అనేక కళారూపాలను రూపొందించారు. గతంలో ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటనను నిరసిస్తూ, మైనంతో ఆయన రూపొందించిన కళారూపం అందరినీ ఆలోచింపజేసింది. అదే విధంగా, తల్లిని గౌరవించాలనే సందేశంతో బియ్యపు గింజలతో తల్లి రూపం, తల్లి పాల ఆవశ్యకతను తెలియజేస్తూ బిడ్డకు పాలిస్తున్న తల్లి రూపం వంటి కళారూపాలు ఎంతో అద్భుతమన్పిస్తాయి. ప్రధాని పిలుపు మేరకు భేటీ బచావో-భేటీ పడావో..అనే నినాదానికి స్ఫూర్తిగా, ఆడపిల్లలను చదివించాలటూ 'బాలిక' చిత్రాన్ని రూపొందించడం, గాంధీజీ, నేతాజీ, బాలగంగాధర తిలక్, సర్వేపల్లి రాధాకృష్ణన్, గోపాలకృష్ణ గోఖలే, సరోజినినాయుడు వంటి మహనీయుల రూపాలను బియ్యం గింజలతో రూపొందించడం వంటి కళారూపాలు ఆయనకు మంచి పేరుప్రఖ్యాతులు తెచ్చాయి. అబ్దుల్ కలామ్ మృతికి సంతాపంగా భారతదేశం కన్నీరు చిందిస్తున్నట్లుగా వుండే చిత్రం, పర్వతారోహకుడు మల్లి మస్తాన్‌బాబు మృతిచెందినప్పుడు పర్వతాలు కన్నీరు కారుస్తున్నట్లుగా వేసిన చిత్రం వగైరాలన్నీ పార్థసారథి కళా ప్రతిభకు ప్రతీకలే. నేటికీ ఆయన అనేక సూక్ష్మ కళారూపాలను తయారుచేస్తూ గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లోనూ స్థానం దక్కించుకోవాలని నిరంతర కృషి చేస్తూనే వున్నారు. ప్రకృతిని నాశనం చేయవద్దు.. భూమాతను కాపాడాలంటూ సామాజిక స్పృహతో రూపొందించిన కళారూపం, రెండు లక్షల అగ్గిపుల్లలతో రూపొందించిన మర్రిచెట్టు, గోటిపై వుండేలా రూపొందించిన సూక్ష్మ చదరంగం బోర్డు..ఇలా ఎన్నో కళారూపాలు పార్థసారథి కళానైపుణ్యంలోంచి పుట్టుకొచ్చినవే. ఆయన కళానైపుణ్యం.. కళా సేవ అభినందనీయమైనది. ఆయన మరిన్ని అంతర్జాతీయ స్థాయి అవార్డులు సాధిస్తాడని ఆశిద్దాం!

గల్పిక

# దేశమంతా నటులే..!

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరం. గాంధీనగర్‌లోని స్వతంత్ర విహార్ పార్క్... సాయంత్రం 5గంటలైంది. చంద్రబాబు పుణ్యాన పని పాటా లేకుండాపోయిన రియల్ బ్రోకర్ గుర్నాధం, బిల్డర్ బిల్డప్ భద్రం వేరుశెనక్కాయలు కొనుక్కుని అక్కడకు చేరుకున్నారు. చంద్రబాబు విధానాల మూలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం దారుణంగా పడి పోయిందని, లేకుంటే ఇదివరకే ఒక రేంజ్‌లో వుండేవాళ్లమని తమ పాటికి తాము చెప్పుకుని, చంద్రబాబును ఓ అరగంట తిట్టుకున్నారు. తర్వాత గుర్నాధం... రియల్‌ఎస్టేట్ గురించి మాట్లాడుకుంటే మనసు కకావికలం అవుతుందని, రాత్రికి నిద్ర కూడా పట్టదని ఆలోచించి వెంటనే టాపిక్ డైవర్ట్ చేస్తూ... ఉదయాన్నే పేపర్ చూసాను రా, తన జీవితచరిత్రను ఎవరన్నా సినిమాగా తీస్తే అందులో నటించాలని వుందని లాలూ ప్రసాద్‌యాదవ్ చెప్పాడు. తాను బాగా నటించగలనని కూడా చెప్పాడని గుర్నాధం అన్నాడు. బిల్డప్ భద్రం వెంటనే... ఛస్, నోర్ముయ్, ఆయన కొత్తగా నటించేదేముంది, ఇంతకాలం రాజకీయాల్లో ఆయన చేసిందంతా అదే కదా, సినిమాయాక్టర్లు ఆ షూటింగ్ టైం వరకే నటించిపోతుంటారు, కాని రాజకీయాల్లో ఉండేవాళ్లకు 24గంటలూ నటనే డ్యూటీగా వుంటుంది. లాలూ యాక్షన్ ముందు ఎన్టీఆర్, ఎస్వీఆర్, అక్కినేని, నేటి ప్రకాశ్‌రాజ్ వరకు అందరూ దిగదుడుపే!

**గుర్నాధం :** అవున్రా, నువ్వంటే గుర్తొస్తుంది. మన నాయకులలో ఒక్కొక్కరిలో ఒక్కో నటుడు కనిపిస్తాడు. మన చంద్రబాబునే చూడు ఎన్ని రకాల పాత్రలు పోషిస్తున్నాడో. ఆయనకు గ్లామర్ కొంచెం తక్కువైందిగాని, యాక్షన్‌లో మాత్రం అదరగొట్టేస్తున్నాడు. సింగపూర్ అమరావతి రాజధాని రూపశిల్పిగా, నవ్యాంధ్ర అభివృద్ధి సారథిగా, ప్రజాసంక్షేమం కోసం పాటుపడే నాయకునిగా, అవినీతిని చీల్చి చండాడే 'నిప్పురవ్వ'గా... అబ్బో ఎన్ని వెరైటీ యాక్షన్‌లో... ఆయన సినిమాల్లోకి పోయుంటే చాలామంది క్యారెక్టర్ ఆర్టిస్టులకు అవకాశా లుండేవి కావేమో... ఏదేమైనా నటిస్తున్నట్లు తెలియకుండానే నటించే గొప్ప నటుడాయన! రాజకీయాల్లో నటనకు అవార్డులంటూ ఇవ్వాల్సి వస్తే మొదటి నంది ఆయనకే ఇవ్వాలి.

**బిల్డప్ భద్రం :** నటనలో జగన్ మాత్రం తక్కువ తిన్నాడ్రా? చంద్రబాబు ఒక పరిపూర్ణ నటుడిగా ఎదగడానికి ఇన్నేళ్లు పట్టింది. కాని రాజకీయాల్లోకి అడుగుపెట్టడంతోనే జగన్ బ్లాక్‌బస్టర్లు, బాక్సాఫీసు బద్దలు వంటి రికార్డులు సృష్టించాడు. ప్రజల మధ్యకెళితే ఆయన ఎంత బాగా నటిస్తాడో చూసావా? వృద్ధులను గుండెలకు హత్తుకుంటూ... పసిబిడ్డల తలలు నిమురుతూ... స్లమ్‌లో పిల్లలను ముద్దాడుతూ... ఇలా పూర్తిస్థాయిలో పెర్ఫార్మెన్స్ చూపిస్తున్నాడు. ఒక్క యాక్షన్నే కాదు, ఓదార్పుయాత్రలప్పుడు ఎంత సెంటిమెంట్ పండించాడో చూసావా...

**గుర్నాధం :** అసలు వీళ్లది కాదుగాని మన గవర్నర్ నరసింహన్ యాక్షన్ సూపర్! ఆయన పరిస్థితి 'తల్లా... పెళ్లామా' సినిమాలో నటించినట్టుగా వుంది. అటు తెలంగాణ వాళ్లకు కోపం రానీయకుండా, ఇటు ఆంధ్రావాళ్లను నొప్పించకుండా కేసీఆర్ ఏ పని చేసినా అక్కడ సూపర్ అంటున్నాడు. ఇక్కడకొచ్చి చంద్రబాబు కడుతున్న అమరావతి భవనాలను చూసి శెభాష్ అని మెచ్చుకున్నాడు. ఆయన యాక్షన్ చూస్తే పాత సినిమాలలో గుమ్మడి వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి గుర్తుకొస్తున్నారు. రాజకీయ నటులకు అవార్డులు అంటూ ఇవ్వడం జరిగితే బెస్ట్ సపోర్ట్ అవార్డ్ ఆయనకే ఇవ్వాలి.

**బిల్డప్ భద్రం :** నువ్వు స్టేట్‌లెవల్లో మాట్లాడుతున్నావ్, మన లోకల్ టాలెంట్‌ను గుర్తించలేకపోతున్నావ్, నెల్లూరులో ఆస్కార్ స్థాయి నటులున్నారన్న విషయం తెలీదా?

**గుర్నాధం :** అంతస్థాయి నటులెవరబ్బా?

**బిల్డప్ భద్రం :** విశ్వవిఖ్యాత నటవిధ్వంస స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(65) సంగతి తెలుసు కదా... ఆయనలో ఎంత గొప్ప నటుడున్నాడో తెలుసుకదా! తెలుగు సినీ పరిశ్రమలో చాలామంది అదృష్టవంతులు... ఇతనుగాని సినిమాల్లోకి పోయుంటే చాలామందికి అవకాశాలు పోయుండేవి. ఇతను సినిమాల్లోకి రానందుకు వాళ్లంతా ఇతనికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఇతని నట భీభత్సానికి రాజకీయాల్లోనే కల్లోలాలు వస్తున్నాయి. ఇక సినిమాల్లోకి వెళ్లుంటే బాక్సులు బద్దలే!

**గుర్నాధం :** నువ్వన్నది నిజమే. లోకల్ టాలెంట్‌ను మరచిపోయా... అసలు లాలూ జీవితం మీద కాదు... ఇతని జీవిత చరిత్ర మీదే ఒక సినిమా తీసి, ఇతని చేతే నటింపచేయొచ్చు. మంచి బ్లాక్‌బస్టర్ మూవీ అయ్యేది.

**బిల్డప్ భద్రం :** ఆయన జీవితం మీద సినిమా తీయడమంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని కదా? ఏ నిర్మాత కూడా ముందుకు రాడు.

**గుర్నాధం :** అంత బడ్జెట్ ఎందుకవుతుందిరా...

**బిల్డప్ భద్రం :** ఆయన సినిమాలో హీరో ఒక్కడే... హీరోయిన్‌లను మాత్రం చాలామందిని పెట్టాలి. అంత బడ్జెట్ ఎవడు భరిస్తాడంటావ్!

**గుర్నాధం :** అది కూడా నిజమే... ఆయన జీవిత చరిత్ర మీద సినిమా తీయాలంటే టాలీవుడ్ హీరోయిన్‌లనే కాకుండా కోలీవుడ్, బాలీవుడ్ హీరోయిన్‌లను కూడా తీసుకురావాల్సి వుంటుంది. మనం ఇంకో లోకల్ టాలెంట్‌ను కూడా మరచిపోయాం.

**బిల్డప్ భద్రం :** ఎవరబ్బా అతను...

**గుర్నాధం :** రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. అతనిలోనూ అన్ని షేడ్స్ వుంటాయి. పొలిటికల్ ప్రకాశ్‌రాజ్ అనుకోవచ్చు. ప్రకాశ్‌రాజ్‌ను మనం బొమ్మరిల్లులో మంచి తండ్రిగా, 'దూకుడు'లో మంచి ఎమ్మెల్యేగా, 'పోకిరి'లో విలన్‌గా, 'అతడు'లో సిన్సియర్ పోలీస్ ఆఫీసర్‌గా... ఇలా ప్రకాశ్‌రాజ్‌ను ఎన్ని కోణాల్లో చూస్తామో, రాజకీయాల్లోకొచ్చేసరికి కోటంరెడ్డిలోనూ అన్ని కోణాలు చూడగలం. నటిస్తుంటే... జీవిస్తున్నట్లుగా కనిపించడం ఆయన స్టైల్.

**బిల్డప్ భద్రం :** వీళ్లంతా స్టేట్, సెంట్రల్ లెవల్ నటులే! కాని మన ప్రధాని నరేంద్ర మోడీ నటనలో హాలీవుడ్ రేంజ్‌ను దాటిపోయాడు. భారతీయ ప్రేక్షకులనే కాకుండా ప్రపంచంలోని అన్ని దేశాల ప్రేక్షకులను మెప్పించేలా నటిస్తున్నాడు. తన అద్భుతమైన నటనా ప్రతిభతో అన్ని దేశాల వారిని ఆకట్టుకుంటున్నాడు.

**గుర్నాధం :** అవున్రా, నువ్వన్నది కరెక్టే! ఈమధ్య మన ప్రధాని మోడీని మనకంటే విదేశీయులే వారి వారి దేశాలలో ఎక్కువుగా చూస్తున్నారు. దర్శకుడు శంకర్, కమల్‌హాసన్‌తో 'భారతీయుడు' సినిమా తీసినట్లే నరేంద్రమోడీని పెట్టి 'సంచారభారతీయుడు' అనే సినిమాను తీయొచ్చు... ఏమంటావ్?

**బిల్డప్ భద్రం :** ఇక అనేదేముంది, టైం తొమ్మిదైంది, ఇక ఇంటికి పోదాం. బయట బిజీగా పనులు చేస్తున్నట్లు ఇంట్లో బిల్డప్ ఇస్తేగాని... అదే మనం కూడా నటిస్తే గాని పెళ్లాం తిండి పెట్టదు, ఇక లెయ్...

**గుర్నాధం :** ఓకే, మనకూ నటించే టైం అయ్యింది పోదాం పద!

---

## మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

చేపట్టిన పనులకు ఆటంకాలుంటాయి. అయితే ఇతరుల సహకారంతో నెరవేరగలవు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. ఉద్యోగులు అధికారులతోను పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగాలి. ఇతరులకు సహాయసహకారాలు అందిస్తారు. కొత్త విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. బాకీలు రావలసినవి నిలబడిపోతాయి. ఉన్నత విద్యావకాశాలు దొరుకుతాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర1, 2పాదాలు

కొత్త పెట్టుబడులు, వ్యాపార విస్తరణకు అవకాశాలు దొరుకుతాయి. ఆర్థికంగా బాగుండి, వృత్తులలో గాని వ్యాపారాలలోగాని ఆదాయం పెరుగుతుంది. స్థాన మార్పులు, పనిభారం ఉద్యోగులకు అధికారులకు ఉంటుంది. శుభవార్తలు వింటారు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, శుభకార్యాల్యు నిర్ణయం జరుగుతుంది. స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి.

## మిధునం



మృగశిర 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అనుకోని అదనపు ఖర్చులవల్ల ఋణం చేయవలసి వస్తుంది. ఉద్యోగులు తమ సహచరులతోను, పబ్లిక్‌తోను అప్రమత్తంగా ఉండండి. ఉద్యోగప్రయత్నాలు ఫలించ దానికి మరికొంత సమయం పట్టుతుంది. శుభకార్యాలు నిర్ణయమై ప్రముఖముగా వ్యవహరిస్తారు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపండి. వృత్తివ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలు లాభదాయకంగానే సాగుతాయి. సన్నిహితుల సహకారంతో అనుకున్న పనులు జరుపు కొంటారు. రావలసిన బాకీలు అందుతాయి. కోర్టు వ్యవహారాలలో కొంత అనుకూలత కలదు. శుభకార్య ప్రయత్నాలు బాగా జరుపుతారు. బిడ్డల విద్యా ఉద్యోగ విషయాలలో సంతృప్తి ఉంటుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత, అప్పుడప్పుడు టెన్షన్‌గా ఉంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వ్యాపారాలలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. తగాదాలు మనస్పర్థలు సర్దుబాటు కాగలవు. శుభకార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణాలుంటాయి. ఉద్యోగ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఉద్యోగార్థులకు మంచి అవకాశాలు, విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు దొరుకుతాయి. అనుకున్న పనులు సక్రమంగా జరిగినా టెన్షన్ ఎక్కువగా ఉంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆర్థిక స్థితి మెరుగు కాగలదు. కొంత ఋణాలు తీరుతాయి. నష్టాలు, ఆటంక పరిస్థితులను సర్దుబాటు చేసికొంటారు. కుటుంబసభ్యులకు స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. వ్యవహారాలలో ఇతరుల సలహాలను కూడా స్వీకరించడం మంచిది. శుభకార్యాలు నిర్ణయం అగును. వృత్తి వ్యాపారాలలో స్వల్ప వృద్ధి. సోదరులకు మేలు జరుగుతుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 15.7.2016 నుండి
తేది. 21.7.2016 వరకు

ఈ వారం కర్కాటకంలో రవిబుధ శుక్రులు, సింహంలో గురు రాహువులు, వృశ్చికంలో శని కుజులు, కుంభంలో కేతువు, వృశ్చిక ధనుర్మకరములందు చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

జూలై 15 శుక్రవారము తొలిఏకాదశి, చాతుర్మాస్య వ్రతారంభము

జూలై 16 దక్షిణాయన ప్రారంభము.
జూలై 19 మంగళవారం గురుపూర్ణిమ.

**ఆషాఢ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 15 | శుక్ర | ఏకాదశి | రా॥ గం.12.47ని॥ |
| తేది. 16 | శని | ద్వాదశి | రా॥ గం.2.25ని॥ |
| తేది. 17 | ఆది | త్రయోదశి | రా॥ గం.3.40ని॥ |
| తేది. 18 | సోమ | చతుర్దశి | రా॥ గం.4.20ని॥ |
| తేది. 19 | మంగళ | పూర్ణిమ | రా॥ గం.4.36ని॥ |

**ఆషాఢ మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 20 | బుధ | పాడ్యమి | రా॥ గం.4.14ని॥ |
| తేది. 21 | గురు | విదియ | రా॥ గం.3.30ని॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి ఉపాధి పథకాలలో రాణిస్తారు. కొత్త పెట్టుబడులకు, వ్యాపారముల విస్తరణకు అవకాశాలుంటాయి. ఆస్తి వ్యవహారాలు, బాకీల వ్యవహారాలు ఒక పరిష్కారానికి వచ్చే అవకాశాలున్నవి. ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత, విలువైన వస్తువులు సమకూర్చుకొనడం జరుగుతుంది. శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇతరులకు సహాయం అందిస్తారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

నిలబడిపోయిన పనులకు చలనం కలుగుతుంది. వృత్తి జీవనం కలవారికి వ్యాపారవర్గాల వారికి అభివృద్ధి, ఆదాయం బాగుంటుంది. సొంత నిర్ణయాలు మంచిది. ఉద్యోగులు తమ పైఅధికారులతో, పబ్లిక్‌తో జాగ్రత్తగా వ్యవహరించండి. శుభకార్య ప్రయత్నాలు అనుకూలం కాగలవు. విదేశ, దూరప్రాంతాల సందర్శనకు ప్రయత్నాలు జరుగుతాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్త వహించాలి. వ్యాపార వృద్ధి అవకాశాలు సరిగా ఉండవు. అధికారులతో ఉద్యోగ వ్యాపారులకు ఇబ్బందులుంటాయి. బంధువర్గం వల్ల పేచీలు రావచ్చును. తీసికొనిన నిర్ణయాల వల్ల నష్టపడే అవకాశాలున్నాయి. సామాన్య ఆదాయం ఉంటుంది. అనవసర వ్యవహారాలు జరపవద్దు. చేపట్టిన పనులకు ఆటంకాలుంటాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలు మెల్లగా అభివృద్ధి చెందుతాయి. ఆర్థిక ఇబ్బందులు తొలగి అవకాశాలు వేగమందుకుంటాయి. ఋణ సమస్యలు పరిష్కారం కాగలవు. సోదరవర్గంతో పేచీలు లేకుండా చూచుకొనాలి. శుభకార్యాలు అనుకూలించగలవు. చిన్నచిన్న విషయాలను తీవ్రంగా పరిగణించకుండా సంయమనం పాటించాలి. కీలక సమావేశాలలో పాల్గొంటారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

పట్టుదల, దీక్షతో అనుకున్న పనులకు ఆటంకాలు వచ్చినా పనులు సాధించుకొంటారు. ఆదాయం కంటే ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. వ్యాపారవృద్ధి అవకాశాలు తప్పిపోవచ్చును. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరుకుతాయి. కుటుంబంలో అనారోగ్య బాధలుంటాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడవచ్చును. రావలసిన బాకీలు నిలబడిపోగలవు. అధికారులకు స్థానమార్పులుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉన్నత విద్యా ఉద్యోగ అవకాశాలు లభించగలవు. వృత్తి ఉపాధి పథకాలలోను, వ్యాపారాలలోను అభివృద్ధి బాగుంటుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. అనుకున్న పనులు విజయవంతంగా నెరవేర్చుతారు. ఆరోగ్య లోపం స్వల్పంగా ఉంటుంది. శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. అనుకున్న ప్రయాణ లక్ష్యాలు నెరవేరుతాయి. ఉన్నత విద్యావకాశాలుంటాయి.



# కార్మికులకు ఆసుపత్రి కట్టించండి

ఇటీవల జిల్లా బీజేపీ అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి నెల్లూరుజిల్లాలోని సమస్యల పరిష్కారానికి కేంద్రమంత్రి వెంకయ్యానాయుడును ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండల పరిసర ప్రాంతాల్లో ఏపిజెన్‌కో, కృష్ణపట్నం పోర్టు, థర్మల్ పవర్ స్టేషన్, ఎన్‌సిసి పవర్ స్టేషన్, మీనాక్షి ఎనర్జీ, మధుకాన్ ఆయిల్ రిఫైనరీ వంటి అనేక సంస్థల్లో పని చేస్తున్న దాదాపు 30వేల మందికి ఇఎస్‌ఐ కార్డులు మంజూరు చేసి వున్నారని, చుట్టుపక్కల కార్మికులు అనారోగ్యానికి గురైతే 30 నుంచి 40కిలోమీటర్ల దూరం ఉండే నెల్లూరుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. తమరు పరిశీలించి ముత్తుకూరు మండలంలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. అలాగే నెల్లూరు శివారు ప్రాంతం కొత్తూరులో నూతనంగా నిర్మించిన కేంద్రీయ విద్యాలయంలో మౌలిక సదుపాయాలు, కంప్యూటర్లు, జనరేటర్, తదితర ఏర్పాట్లకు కృషి చేయాలని కోరారు.

# ఇద్దరు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ బాదివల్లి శ్రీనివాస్

గూడూరు డివిజన్‌లో నేరాలు చేస్తూ ఏడాదిపాటుగా తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు గూడూరు డిఎస్పీ బాదివల్లి శ్రీనివాస్ తెలిపారు. వారినుంచి రూ.2.20లక్షల నగదు, సుమారు రూ.10లక్షలు విలువచేసే 40సవర్ల బంగారం స్వాధీనం చేసుకొన్నట్లు చెప్పారు. గూడూరు డిఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన గూడూరు రూరల్, వాకాడు సిఐలు శ్రీనివాసులురెడ్డి, అక్కేశ్వరరావులతో కలిసి వివరాలు వెల్లడించారు. పట్టణ సమీపంలోని గాంధీనగర్‌కు చెందిన రంగనాథ్‌కిరణ్, శివనారాయణ చెడు అలవాట్లు, జల్సాలకు బానిసలై పలుచోట్ల చోరీలకు పాల్పడ్డారు. ఇళ్ళకు తాళాలు వేసి ఉన్నవాటిని గుర్తించి చాకచక్యంగా వాటిని పగులగొట్టి చోరీలకు పాల్పడేవారు. తొమ్మిది నెలలుగా చోరీలకు పాల్పడుతూ జల్సాలు చేసేవారు. చోరీలపై పోలీసులు ప్రత్యేకబృందంగా ఏర్పడి నిఘా ఉన్న సమయంలో నిందితులను చిల్లకూరు సమీపంలో వరగలి క్రాస్‌రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఎస్‌ఐలు సాంబశివరావు, జగన్‌మోహన్‌రావు, ఐడి పార్టీ సిబ్బంది, వెంకటేశ్వర్లు రాజు, ఆదినారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



# శ్రీకాళహస్తి న్యూస్

## ఫ్యాషన్ ఫోటోగ్రఫీలో కోలా ఘనత



శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు కోలా ఆనంద్ కుమారుడు కోలా హృతిక్ డ్రీమ్‌కాస్ట్ మోడలింగ్ వర్క్‌లో ప్రతిభ చూపుతున్నాడు. ఇటీవల ఆయన చెన్నైలో ప్రముఖ ఫ్యాషన్ ఫోటోగ్రాఫర్ కార్తీక్ శ్రీనివాస్, హేమల వద్ద తర్ఫీదు పొందాడు. హృతిక్ ఈ వర్క్‌షాప్‌లో సర్టిఫికేట్ కూడా పొందాడు. కోలా ఆనంద్ ప్రత్యేకశ్రద్ధ తీసుకుని తన కుమారుడిని ఈ కోర్సులో చేర్పించాడు. పెద్ద పెద్ద ఫ్యాషన్ షోలు నిర్వహించి ఫ్యాషన్ ఇండస్ట్రీకి తన కుమారుడిని మోడల్‌గా చేయాలన్నది తన లక్ష్యమని ఈ సందర్భంగా ఆనంద్ పేర్కొన్నారు. ఫ్యాషన్ షోలో ఫిల్మ్‌స్టార్స్, ఫ్యాషన్ మోడల్స్, చిరోగ్రాఫి వంటి వాటిల్లో శిక్షణ ఇస్తున్నారు. పలు పోటీలలో సైతం హృతిక్ బహుమతులు గెలుచుకోవడం విశేషం.

# దేశంను విమర్శించే అర్హత లేదు

## - వంటేరుపై మలిశెట్టి ధ్వజం

తెలుగుదేశం పార్టీలో వివిధ హోదాల్లో పదవులు అనుభవించి ఇప్పుడు పార్టీనే విమర్శిస్తావా అని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డిని విమర్శించారు. ఈ నెల 9వ తేదీన స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 20 సంవత్సరాల రాజకీయ అనుభవంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని మాజీ ఎమ్మెల్యేగా ఉన్న వంటేరు వేణుగోపాల్‌రెడ్డి దేశ రాజకీయాలను శాసించిన నందమూరి తారక రామారావును విమర్శించడం బాధాకరమన్నారు. 1994లో రాజకీయాల్లోకి వచ్చిన వంటేరుకు ఎంతో పేరుప్రతిష్ఠలు ఉన్న గొట్టిపాటి కొండపనాయుడిని కాదని తెలుగుదేశం పార్టీ కావలి టికెట్టు ఇచ్చి రాజకీయాల్లోకి తీసుకువచ్చిన చంద్రబాబును విమర్శించే స్థాయి లేదన్నారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయావని ఆర్టీసీ ఛైర్మన్ పదవిని కట్టబెట్టి 99లో తిరిగి ఎమ్మెల్యేగా గెలిపించిన చంద్రబాబును 25కోట్లకు సుబ్బరామిరెడ్డికి అమ్ముడపోయావని విమర్శించడం నీస్థాయికి తగదన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు



# కావలి కబుర్లు

తెలుగుదేశం పార్టీలో ఉన్నపుడు హీరోగా ఉన్నావని ఇపుడు జీరోగా ఉన్నావని నీ స్థాయి ఎక్కడుందో ఒక్కసారి గుర్తుచేసుకోవాలన్నారు. జిల్లా టీడీపీ కార్యదర్శి గుత్తికొండ కిషోర్, మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కిర్మాణీ సర్దార్, జ్యోతిబాబు రావు, టీడీపీ పట్టణ కార్యదర్శి అమరా యాదగిరి గుప్తాలు మాట్లాడుతూ.. గతంలో తెలుగుదేశం పార్టీలో ఎన్నో పదవులు అనుభవించావని ఇప్పుడు జగన్ మెప్పుకోసం పార్టీని విమర్శించడం బాధాకరమన్నారు. తెలుగువారి ఆరాధ్యదైవం ఎన్‌టీఆర్‌ను విమర్శించే స్థాయి నీకు లేదని చంద్రబాబునాయుడును రాజకీయ గురువని చెప్పుకున్న మీరు ఇప్పుడు విమర్శించడం శోచనీయమన్నారు. చరిష్మా గల ఇతర నాయకులతో పోల్చడం విడ్డూరంగా ఉందన్నారు. రాజశేఖర్‌రెడ్డిని పొగడదలచుకుంటే పొగిడి మీ స్థాయిని పెంచేకోండే తప్ప తెలుగుదేశం పార్టీ నాయకులను విమర్శిస్తే మీ రాజకీయ జీవితం శూన్యం అవుతుందని అన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కవితా ప్రసాద్, గంగినేని వెంకటేశ్వర్లు నాయుడు, రాజ్‌కుమార్ చౌదరి, కౌన్సిలర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వంపై వైకాపా దండయాత్ర



సమావేశంలో నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలిలో గడప గడపకు వైఎస్సార్ కాంగ్రెస్ కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి అన్నారు. ఈ నెల 9న స్థానిక పార్టీ కార్యాలయంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకులతో గడప గడపకు వైఎస్సార్ కాంగ్రెస్ నిర్వహించే ప్రణాళికలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను హామీల అమలులో వైఫల్యం, అమరావతి భూకుంభకోణం, ఇసుకు మాఫియా వంటి విషయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కసుమర్లపూడి నారాయణ,పట్టణ ప్రధాన కార్యదర్శి ఏరువ రమేష్, కె.రాజశేఖర్, నాయకులు ప్రసన్నకుమార్, పేరం వెంకటేశ్వర్లు, నెల్లూరు వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజలంతా...

# సుఖసంతోషాలతో జీవించాలి



కంచి పీఠాధిపతితో పుల్లారెడ్డి నగర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ అలేఖ్య

ప్రజలంతా సుఖసంతోషాలతో జీవితం గడపాలని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి అన్నారు. మంగళవారం మున్సిపల్ ఛైర్మన్ పోతుగంటి అలేఖ్య, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గ్రంధి యానాదిశెట్టిలు విజయేంద్రసరస్వతిని కలిసి ఆయన ఆశీస్సులు పొందారు. అనంతరం గొట్టిపాటి చిన్నసుబ్బానాయుడు కళ్యాణమండపం పరిసర ప్రాంతాలలో మారేడు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఇంటిచుట్టూ పరిసర ప్రాంతాలలో మనకు నీడనిచ్చే ఆయుర్వేద ఔషధాలిచ్చే మొక్కలను విరివిగా నాటాలన్నారు. మొక్కలు ఎక్కువగా పెంచడంద్వారా సకాలంలో వర్షాలు పడి పంటలుబాగా పండుతాయన్నారు.

ఈ కార్యక్రమంలో నందదీప్ సాయి సమాజ్ వ్యవస్థాపకులు టంగుటూరి శివప్రసాద్, కోటారెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 24 అంగన్‌వాడీ భవనాలకు

# 168లక్షలు

కావలి నియోజకవర్గంలో 24అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి 168 లక్షల నిధులు మంజూరు అయినట్లు రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీదా మస్తాన్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావలి మండలంలో కట్టకింద పాలెం, చెంచుగానిపాలెం, బైనేటిపాలెం, కొత్తపల్లిలో అంగన్‌వాడీ భవనాలు మంజూరుకాగా బోగోలు మండలంలో ఉమామహేశ్వరపురం, ముంగమూరు, ఎస్సీపాలెం, సీతారెపాలెం, టెంకాయచెట్లు పాలెం, కొత్తబంగారుపాలెం, అలిచెర్ల బంగారుపాలెం, వీఎన్ఆర్‌పేటలో అంగన్‌వాడీ భవనాలు మంజూరు అయ్యాయి. అల్లూరు మండలంలో గడ్డగుంట, జువ్వాగు లక్ష్మీపురం, అదిరాఘవపురం, అల్లూరు, బోడిసత్రం, చెర్లోసంఘాలలో దగదర్తి మండలంలో, ఉలవపాళ్ల, ఉలవపాళ్ల అరుంధతీవాడ, ధర్మవరం, కాట్రాయపాడు, అనంతవరంలో అంగన్‌వాడీ భవనాలు మంజూరయ్యాయన్నారు. ఆయా గ్రామాలలో వెంటనే భవనాలు నిర్మించి మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు.

### గడప గడపకు...
# ఏ ముఖం పెట్టుకుని వెళతారు
**- ఆనం వివేకానందరెడ్డి**



తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకుని లక్షల కోట్లు దోచుకుని ఈ రాష్ట్రాన్ని పేద రాష్ట్రంగా చేశారని, ఇంతటి మహాపాపం చేసిన జగన్, ఆయన పార్టీ వారు గడప గడపకు ఏ ముఖం పెట్టుకుని వెళతారని మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆనం వివేకానందరెడ్డి ధ్వజమెత్తారు. 9వ తేదీ నెల్లూరు ఏసి సెంటర్‌లోని తన కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ కష్టాల్లో వున్న రాష్ట్రాన్ని అహర్నిశలు కష్టపడుతూ అభివృద్ధి పథం వైపు చంద్రబాబునాయుడు తీసుకువెళుతున్నారని, రెండేళ్లలో ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నీ నెరవేరుస్తున్నారని, ప్రతిపక్ష నేత అంటే ప్రభుత్వ లోటుపాట్లను ఎత్తి చూపిస్తూ నిర్మాణాత్మకమైన సూచనలు, సలహాలు ఇవ్వాల్సింది పోయి చంద్రబాబు నాయుడిని ఎప్పుడు దించేస్తామా అని ఎదురు చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాఘవరెడ్డి, మునాఫ్, ఆనం రంగమయూర్‌రెడ్డి, కిన్నెర ప్రసాద్, సిరిగిరి చక్రవర్తి, ముజీర్ తదితరులు పాల్గొన్నారు.

# వంశీకి 'సింహపురి'లో వైద్యం



పది నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమిత మైన ఆటోడ్రైవర్ వంశీని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సింహపురి హాస్పిటల్‌లో చేర్పించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు వైయస్సార్సీపీ నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు మంగళవారం కొత్తూరు హెచ్‌కె బాబునగర్ నుంచి వంశీని ప్రత్యేక అంబులెన్స్‌లో సింహపురి హాస్పిటల్‌కు తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుల నివేదిక మేరకు కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు సహకారంతో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

### సీమాంధ్ర బి.సి సంఘం
# ఉపాధ్యక్షుడుగా చందు



సీమాంధ్ర బి.సి సంక్షేమ సంఘం నెల్లూరుజిల్లా ఉపాధ్యక్షుడుగా నందిగం చంద్రశేఖర వర్మను ఎన్నుకున్నారు. ఈ నెల 14వ తేదీన నెల్లూరులో జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య, చంద్రశేఖరవర్మకు నియామకపత్రం అందజేశారు.

# సీనియర్లకు సలామ్
(మొదటి పేజీ తరువాయి)

సంపాదించి పెట్టింది. వై.యస్ కష్టాల్లో వున్నప్పుడు కూడా వారు ఆయనను విడిచి పోకుండా చేసింది. వైకాపా శ్రేణులకు ఈ నెల 13వ తేదీ జరిగిన ఓ సంఘటన ఎనలేని ఆనందాన్ని కలిగిస్తోంది. పార్టీ అధినేత జగన్ రాజమండ్రి వెళ్లాడు. ఇటీవలే తన తల్లిని కోల్పోయిన మాజీఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉండవల్లి అరుణ్‌కుమార్‌ను పరామర్శించాడు. వై.యస్. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉండవల్లికి ఇచ్చిన ప్రాధాన్యత మరువలేనిది. 'మార్గదర్శి' అక్రమాలపై కేసులు వేయడం ద్వారా మీడియా మొఘల్ రామోజీరావును మూడు చెరువుల నీళ్లు తాగించిన ఘనుడు అరుణ్‌కుమార్. ఇలాంటి సీనియర్ నేతలు శ్రీకాకుళం నుండి అనంతపురం దాకా చాలామందే వున్నారు. వీరిలో కొందరు కాంగ్రెస్‌లోనే వుండిపోగా ఇంకొందరు తెలుగుదేశంలోకి వెళ్లిపోయారు. ఉండవల్లి అరుణ్‌కుమార్ లాంటి సీనియర్‌లు ఈరోజు జగన్‌కు ఎంతైనా అవసరం. పార్టీ మొత్తం యువరక్తంతోనే నిండిపోతే సరికాదు, అనుభవజ్ఞులు కూడా ఉండాలి. జిల్లాకొక సీనియర్‌నన్నా పార్టీలో చేర్చుకుంటే భవిష్యత్‌లో జగన్‌కే ఉపయోగం.

# నగరంలో లక్ష మొక్కలు నాటుదాం
**- మేయర్ పిలుపు**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, నగరంలో లక్షలు మొక్కలు నాటే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ పిలుపునిచ్చారు. నగరంలోని బివిఎస్ కళ్యాణమండపం వద్ద విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమంలో పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘంవారు భాగస్వాములు కావడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టిడిపి నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్ళపాక అనూరాధ, వైవి రామిరెడ్డి, ధర్మవరపు సుబ్బారావు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కందుకూరు చెంగయ్యఆచారి, ఇందుకూరు రమేష్‌కుమార్ ఆచారి, పేట మాధవయ్యఆచారి, దండపాణి సురేష్‌కుమార్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన అన్నమయ్య సంకీర్తనల గానం

నెల్లూరులోని భారతి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 10న అన్నమాచార్య సంకీర్తనల గానం అందరికీ వీనుల విందు చేసింది. ఆ విద్యాలయం చిన్నారులు, కళాకారులు భక్తిరసభరితంగా అన్నమయ్య సంకీర్తనలను గానం చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. భారతి సంగీత విద్యాలయం అధినేత్రి రమాదేవి ఆధ్వర్యంలో ఈ సంగీత కార్యక్రమం జరిగింది. అనంతరం గాన కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు. కావలి మార్కెటింగ్ ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం, కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి, న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి, రంగనాధస్వామి దేవస్థానం కమిటీ సభ్యుడు కాకరపర్తి జగన్మోహన్‌రావు, నలుబోలు బలరామయ్యనాయుడు, రామచంద్రారెడ్డి, కళాంజలి అనంత్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమమా..? సక్రమమా..?
(మొదటి పేజీ తరువాయి)

తుడిచి పెట్టేస్తున్నాడు. 2015 నుండి ప్లాన్ అప్రూవల్‌కు విరుద్ధంగా కట్టిన, కడుతున్న నిర్మాణాలను తొలగించాల్సిందేనని ఆయన గట్టి పట్టుదలతో ఉన్నట్లు సమాచారం. ఇటీవలే టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్ రఘు సారథ్యంలో ప్రత్యేక బృందాలు నెల్లూరు నగరమంతా గాలించి నిబంధనలను అతిక్రమించిన వందలాది నిర్మాణాలను గుర్తించారు. కొన్నింటిని తొలగించారు కూడా! మిగతా భవన యజమానులకు మీ అంతట మీరే అతిక్రమణలను తొలగించుకోవాలంటూ నోటీసులు జారీ చేశారు. భవనాల యజమానులు కట్టడాలను తొలగించకుండా కోర్టుకెళ్లి స్టే తెచ్చుకుంటారన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం తరపున నారాయణే ఎవరికీ స్టే రాకుండా చేసేందుకు కోర్టులో కెవియట్ దాఖలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

నెల్లూరులో నిబంధనలకు విరుద్ధంగా కడుతున్న భవనాలను తొలగించాలన్న మంత్రి నారాయణ నిర్ణయంపై పలు విమర్శలొస్తున్నాయి. నెల్లూరులో ఆయన నడుపుతున్న కాలేజీ భవనాలన్నీ నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయా? అన్నది ప్రధాన ఆరోపణ. నగరంలో కొన్ని నారాయణ కాలేజీ భవనాలను చూస్తే ఎవరికైనా ఈ సందేహం కలుగుతుంది. కాలేజీలు నిబంధనలకు అనుగుణంగా లేవు. కాలేజీకి ఉండాల్సిన ఆట స్థలం, విశాలమైన గదులు, ఆడిటోరియం వంటి వసతులేవీ నారాయణ జూనియర్ కాలేజీలలో కనిపించవు. ఇక కొన్ని కాలేజీలకు అనుమతి ఒకచోట వుంటే, వాటిని నడిపేది మాత్రం ఇంకో చోట. ఇక కాలేజీలు నడుపుతున్న భవనాలన్నీ కూడా కమర్షియల్ కాంప్లెక్స్‌లు, అపార్ట్‌మెంట్లే! అరవింద నగర్, ఆచారివీధి, ఫత్తేఖాన్‌పేట, స్టోన్‌హౌస్‌పేట, వేదాయపాలెం... తదితర చోట్ల నారాయణ కాలేజీ భవనాలను చూస్తే ఇక్కడ కాలేజీలను ఎలా నడుపుతున్నారనిపిస్తోంది. అగ్గిపెట్టెల్లాంటి గదుల్లో విద్యార్థులను కుక్కి చదివిస్తున్నారు. ఇక కాలేజీల భవనాలు సైతం ప్లాన్ అప్రూవల్స్‌కు నూటికి నూరు శాతం అనుగుణంగా కట్టినవేమీ కాదు. ఎంతోకొంత పర్సంటేజీ ఉల్లంఘన జరిగే ఉంటుంది. అంతెందుకు 2013లో నారాయణ ఆసుపత్రి ప్రాంగణంలో నిబంధనలకు విరుద్ధంగా భవనాలు కడుతున్నారని చెప్పి, ఆరోజు కాంగ్రెస్ ప్రభుత్వంలో పవర్‌పాయింట్‌గా వున్న ఆనం వివేకానందరెడ్డి అక్కడ ప్రొక్లెయిన్‌లను పెట్టించడం ఇప్పటికీ గుర్తుండే ఉంటుంది.

మనం ఒకరికి నీతిని బోధించేముందు ఆ నీతిని మనం ఆచరించాలి. నారాయణ కూడా ముందు తమ సంస్థలు నడుస్తున్న భవనాలు అక్రమమో, సక్రమమో చూసుకోవాలి. ఆయన నూరుశాతం నిజాయితీగా వుంటే, రేపు నగరంలో నిబంధనలను ఉల్లంఘించి కట్టిన ఎన్ని కట్టడాలను తొలగించినా ఆయనను ఎవరూ వేలెత్తి చూపలేరు. కాబట్టి ముందు ఆయన క్లీన్‌గా ఉండడం అవసరం.

# వర్గపోరు!
(5వ పేజీ తరువాయి)

యాదవ్‌ను నియమించారు. నగర అధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్‌యాదవ్ నియామకమిది. నాకు తెలియకుండా నగర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిని నియమించడానికి నువ్వెవరంటూ ఉడతా వెంకట్రావ్ యాదవ్‌తో యువజన కాంగ్రెస్ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు గొడవకు దిగాడు. కొత్త అధ్యక్షుడిగా ఎస్‌కె ముమిత్‌షాను నియమించారు. కాంగ్రెస్‌లో గట్టి నాయకులుగా మిగిలుందేది పనబాక కృష్ణయ్య, సి.వి.శేషారెడ్డి, చేవూరు దేవ కుమార్‌రెడ్డిలే! జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా వున్న పందిళ్లపల్లి అరుణమ్మ ఇటీవల స్వర్గస్తురాలు కావడం తెలిసిందే! మిగిలిన ఈ నాయకులు తన్నుకుంటుంటే ఆ పార్టీ షట్టర్ త్వరలోనే మూసేయక తప్పదు.

### మైనర్లకు
# మద్యం అమ్మొద్దు...
**నిషేధం ఉల్లంఘిస్తే లైసెన్సుల రద్దు**

మద్యం దుకాణాల్లో 21 ఏళ్ళ లోపు వారికి మద్యం అమ్మడాన్ని పూర్తిగా నిషేధించారు. ఎవరైనా ఈ నిషేధాన్ని ఉల్లంఘించి, నిబంధనను అమలుచేయకుంటే ఆయా మద్యం దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేసి, వారి లైసెన్సులను రద్దు చేస్తారు. ఆ మేరకు ఎక్సైజ్ కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా నుంచి తాజా ఆదేశాలు వచ్చాయి. బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతి మద్యం దుకాణంలో ఎక్కడా విద్యార్థులకు కానీ, 21 ఏళ్ళ లోపు వయసున్న వారికి కానీ మద్యం అమ్మకూడదని, అందుకోసం అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మద్యం దుకాణాల వద్ద ఆ మేరకు బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం దుకాణాల్లో స్కానింగ్ చేసి అమ్మకాలు, ఎంఆర్‌పి ధరలు, ప్రభుత్వ నిబంధనలు సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


# 'కృష్ణా'ర్పణం
(మొదటి పేజీ తరువాయి)

1600కోట్లు తగలేసారు. ఇంత డబ్బు పోలవరం ప్రాజెక్టుకు పెట్టున్నా ఓ రూపు వచ్చేది. ఇన్ని కోట్లు ఖర్చులో దుర్వినియోగమే ఎక్కువ. 144ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ మహాపుష్కరాలకు తరలి రావాలని, ఈ పుష్కరాలలో మునగకపోతే పాపాత్ములవుతారన్నట్లుగా ప్రభుత్వమే ప్రచారం చేసింది. ఆ ప్రచారం దెబ్బకే రాజమండ్రి జనగోదావరిగా మారగా, పుష్కరాల ప్రారంభం రోజునే జరిగిన తొక్కిసలాటలో 27 మంది ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే!

నాటి ఘటనల నుండి ప్రభుత్వం ఏ మాత్రం గుణపాఠం నేర్చుకున్నట్లుగా లేదు. విజయవాడ కేంద్రంగా ఇప్పుడు జరుగనున్న కృష్ణాపుష్కరాలకు కూడా అదే స్థాయిలో ప్రచారానికి పాల్పడుతోంది. పుష్కరాల పనుల పేరుతో టెండర్లు వంటివి లేకుండా వందలకోట్ల పనులను నామినేషన్ క్రింద ఇచ్చేస్తున్నారు. వచ్చే భక్తులకు ఇబ్బందంటూ విజయవాడలో ఎప్పట్నుండో వున్న 45దేవాలయాలను కూల్చేసారు. నాలుగైదు కోట్ల మంది భక్తులొస్తారంటూ అతిగా అంచనా వేస్తూ పుష్కరాలకు ఒక ఇమేజ్ క్రియేట్ చేస్తున్నారు. గోదావరి పుష్కరాలప్పుడు 12రోజుల పాటూ రాజమండ్రిలోనే వున్న చంద్రబాబు, ఒక ఐఏఎస్ ఆఫీసర్ చేయాల్సిన ఉద్యోగాన్ని చేశాడు. ఇక ఇప్పుడు రాజధానిలోనే పుష్కరాలు కాబట్టి చంద్రబాబు విజయవాడను వదిలిపెట్టడు. పుష్కరాల పేరు చెప్పి విజయవాడలో విద్యాసంస్థలకు సైతం 18రోజులు సెలవులిచ్చేశారు. ఒకట్రెండురోజులంటే ఫర్వాలేదు. 18రోజులు సెలవులంటే విద్యార్థులు సిలబస్‌లో ఎంత వెనుకబడిపోతారో తెలియదా?

గోదావరి పుష్కరాలలో చేసిన పొరపాట్లే ఇక్కడా పునరావృతమవుతున్నాయి. ప్రభుత్వం చేస్తున్న ప్రచార హంగామాతో పుష్కరాలు భక్తి కార్యంగా కాక కమర్షియల్ కార్యక్రమంగా మారుతోంది.

# బాబుకు వణుకు పుట్టిస్తున్న విజయసాయి



**వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరపున వేణుంబాక విజయసాయిరెడ్డి పార్ల మెంటులో అడుగుపెడితే ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయోనని చంద్రబాబు భయపడ్డాడో... ఇప్పుడు అవే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. వైకాపా తొలి రాజ్యసభ సభ్యుడిగా పార్లమెంటులో అడుగుపెట్టిన విజయసాయిరెడ్డి, ఏ లక్ష్యంతో అయితే ఢిల్లీ వెళ్లాడో... ఆ పనికి శ్రీకారం చుట్టాడు. ఇది చంద్రబాబుకు కలవరం పుట్టిస్తోంది.**

విజయసాయిరెడ్డి శక్తి సామర్థ్యాలు చంద్రబాబుకు తెలుసు. ఒక సామాన్య ఆడిటర్‌గా వున్న వ్యక్తి ఈరోజు జగన్ కేసుల మూలంగా జాతీయ స్థాయిలో ఫోకస్ అయ్యాడు. వైకాపాకు లోక్ సభ సభ్యులున్నా లాబీయింగ్ నిర్వహించేందుకు సరైన వ్యక్తి లేడు. ఆ లోటును పూడ్చేందుకే జగన్, విజయసాయిరెడ్డిని రాజ్యసభకు పంపాడు. విజయసాయిరెడ్డిని అడ్డుకోవడానికి చంద్రబాబు చేయని ప్రయత్నమంటూ లేదు. పెద్దఎత్తున కోట్లు కుమ్మరించి 20మందికిపైగా వైసిపి ఎమ్మెల్యేలను లాక్కున్నది విజయసాయిరెడ్డిని ఢిల్లీకి పోకుండా చేయడానికే! కాని చంద్రబాబు ప్రయత్నాలు ఫలించలేదు. రాజ్యసభలో అడుగుపెట్టిన విజయసాయిరెడ్డి అప్పుడే ఓ అస్త్రాన్ని బయటకు తీశాడు. పార్టీ ఫిరాయించిన వారిపై వెంటనే చర్యలు తీసుకునేలా ఉద్దేశించిన ప్రైవేట్ బిల్లును ఆయన రేపటి సమావేశాల్లో ప్రవేశ పెట్టబోతున్నాడు. ఇటీవల ఏపి, తెలంగాణలలో చోటు చేసుకున్న పార్టీ ఫిరాయింపుల సంగతి తెలిసిందే! స్పీకర్లు అధికార పార్టీ వారే అయినందువల్ల ఫిరాయింపుదార్లపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. స్పీకర్‌ల చేతిలో ఈ అధికారం ఉన్నంతకాలం పార్టీ ఫిరాయింపులు యధేచ్ఛగా జరుగుతూనే ఉంటాయి. కాబట్టి పార్టీ ఫిరాయింపుదార్లపై చర్యలు తీసుకునే అధికారాన్ని ఎన్నికల కమిషన్ పరిధిలో ఉండేలా విజయసాయిరెడ్డి ఈ ప్రైవేట్ బిల్లును తీసుకురాబోతున్నాడు. దేశంలోని చాలా ప్రాంతీయ, జాతీయ పార్టీలు ఈ ఫిరాయింపులను వ్యతిరేకిస్తున్నవే! కాబట్టి ఆ పార్టీలన్నీ కూడా విజయసాయిరెడ్డి ప్రవేశపెట్టే ప్రైవేట్ బిల్లుకు మద్దతు తెలిపే అవకాశాలు లేకపోలేదు. ఇది జరిగితే చంద్రబాబు ఇరకాటంలో పడ్డట్లే! ఇప్పటివరకు ఢిల్లీలో తెలుగుదేశం తరఫున లాబీయింగ్ పనులు కేంద్రమంత్రి సుజనాచౌదరి చూస్తున్నాడు. వైకాపా తరఫున ఇప్పుడు విజయసాయిరెడ్డి జోరందుకున్నాడు. టీడీపీ ఎన్డీఏలో భాగస్వామిగా వుంది. బీజేపీని వ్యతిరేకించే మిగతా పార్టీలు వైసిపిని చేరతీస్తున్నాయి. ఇది చంద్రబాబుకు ఇబ్బందిగా మారుతోంది. భవిష్యత్‌లో బీజేపీతో చెడితే ఆయన ఈ ప్రాంతీయ పార్టీల కూటమిలోనే కలవాలి. కాని అప్పటికే అక్కడ వైసిపి వుంటే ఈయనకు చోటు దక్కదు. కాబట్టి ఢిల్లీలో అన్ని పార్టీల వారితో లాబీయింగ్ కోసం విజయసాయిరెడ్డి వేగానికి కళ్లెం వేయడం కోసం చంద్రబాబు తాను కన్న బాబు లోకేష్‌బాబును ఢిల్లీలో ఏపి ప్రతినిధిగా నియమించే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.




## ఇదీ.. నారాయణ అప్పుల 'ముచ్చట'

ఇది నిజంగా అవునో.. కాదో తెలియదు కానీ, నెల్లూరులో మాత్రం ఈ పుకార్లు బాగా షికార్లు చేస్తున్నాయి. 'ముచ్చట డాట్ కామ్' ద్వారా ఈ పుకార్లు హల్‌చల్ చేస్తున్నాయి. ఇంతకీ విషయం ఏమిటంటే.. మంత్రి నారాయణకు విద్యా వ్యాపారంతో పాటు పలు ఇతర వ్యాపారాలున్నాయని, గతంలో ఎప్పుడో నెల్లూరు, ప్రకాశం, కడప తదితర జిల్లాల్లోని మోతుబరులు కొందరు కోట్లాది రూపాయలను ఆయన వద్ద డిపాజిట్ చేసేవారని, అందుకు ఆయన బాండ్లు గీండ్లు ఏమీలేకుండా ఓ టోకన్ ఇచ్చేవారని, అయితే ఆ తర్వాత నిర్ణీత కాలపరిమితితో సంబంధిత వ్యక్తుల బ్యాంక్ ఖాతాల్లో ఆ వడ్డీ డబ్బు చేరిపోయేదని, ఇలాంటి పకడ్బందీ వ్యవస్థను ఎవరివద్దా మాట పడకుండా.. ఎంతో నమ్మకంగా ఇంత కాలం ఆయన నెట్టుకొచ్చారని 'ముచ్చట డాట్ కామ్' కథనం. ధృవీకరణకు నోచుకోవు కానీ, జనబాహుళ్యంలో ఇలాంటివి అందరికీ తెలిసిపోతుంటాయని, బహిరంగ రహస్యాలైపోతుంటాయని కూడా సదరు డాట్ కామ్ వ్యాఖ్యానం. అంతేకాదు, ఈ నేపథ్యంలో ఆయన అకస్మాత్తుగా కోట్లాది రూపాయలను ఒకేసారి క్లియర్ చేసేశాడన్న సమాచారం నెల్లూరు జిల్లాలో గుప్పుమంటోందని, ఎక్కువ వడ్డీరేటున్న మొత్తం డిపాజిట్లను తిరిగి చెల్లించేసరికి, వారికి ఆ డబ్బును ఇప్పుడు ఎక్కడ పెట్టాలనేది కూడా పెద్ద సమస్యగా మారిపోయిందని ఆ డాట్ కామ్ కథనం.

ఇదిలావుంటే, నెల్లూరు మినీ బైపాస్ రోడ్ పరిసరాల్లోను, నెల్లూరు శివార్లలోను ఒక్కసారిగా భూముల ధరలు రెట్టింపు అయిపోవడం ఏమిటా..అని కారణాలు వెతికితే, నారాయణ వాపస్ ఇచ్చిన డబ్బుతో వారు ఎడాపెడా భూములు కొనేస్తున్నట్లు కూడా తెలిసిందట. అందువల్లనే ఒక్కసారిగా భూముల ధరలు అలా రివ్వుమని ఆకాశానికి ఎగిరిపోయి వుంటాయని ఆ డాట్ కామ్ అనుమానాత్మక కథనం. అయినా, మంత్రికి ఒక్కసారిగా అంత డబ్బు ఎలా వచ్చిందంటే మాత్రం.. మనకనవసరం అని పేర్కొన్నప్పటికీ, అమరావతి నిర్మాణం సరిగ్గా ఎక్కడో తెలిసిన కొందరిలో ఆయన ఒకరు కాబట్టి.. అంటోందా డాట్ కామ్!

అయినా!..అంత లోతు వ్యవహారాలు మనకెందుకులెండి!.. నారాయణ!.. నారాయణ!..

ఏదేమైనా, మంత్రిగా నెల్లూరు అభివృద్ధికి ఏమీ చేయలేకపోయినా.. ఈ విధంగానైనా రియల్ ఎస్టేట్ భూంకు దోహదపడిన మంత్రిని అభినందిద్దాం!

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# అవినీతి ఫుల్... అభివృద్ధి నిల్

**- వై.వి.సుబ్బారెడ్డి**



తెలుగుదేశం ప్రభుత్వంలో అవినీతి జాస్తిగాను, అభివృద్ధి నాస్తిగాను ఉందని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు వై.వి.సుబ్బారెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ నెల 13వ తేదీన వైకాపా కేంద్ర కార్యనిర్వాహక కమిటి సభ్యుడు స్వర్గీయ దబ్బల రాజారెడ్డి ఉత్తర క్రియల్లో పాల్గొనేందుకు సూళ్లూరుపేటకు వచ్చిన ఆయన ఒంగోలుకు వెళ్తూ నెల్లూరులో ఆగారు. వైకాపా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014ఎన్నికల్లో చంద్రబాబు పచ్చి అబద్ధాలతో ప్రజలను మోసం చేసాడన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఈ ప్రభుత్వం పేద రైతుల నుండి లక్షలాది ఎకకరాల భూములను లాక్కుని కార్పొరేట్ సంస్థలకు అప్పగించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోంది. ఒక్క అమరావతిలోనే రైతుల నుండి 33వేల ఎకరాలు లాక్కున్నారు. సింగపూర్ కంపెనీలకు ఈ భూములను ధారదత్తం చేస్తున్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ని రైతులు ప్రతిఘటిస్తున్నా లెక్క చేయకుండా వేలఎకరాల భూములు గుంజుతున్నారు. ఇప్పుడు బందరు పోర్టుకంటూ లక్ష ఎకరాలకు టెండర్ పెట్టారు. రైతుల భూములను కాపాడేందుకు రైతుల పక్షాన వైసిపి పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు. కేంద్రం నుండి రాష్ట్రానికి ప్రత్యేకహోదా, నిధులు తేవడంలో చంద్రబాబు విఫలమయ్యారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ జరిపిన సర్వేలో అవినీతిలో రాష్ట్రం అగ్రభాగాన నిలిచింది. చంద్రబాబు పరిపాలనా నిర్వాకం ఫలితమిది. సంక్షేమ పథకాల్లో కోత వేసేందుకే ప్రభుత్వం పల్స్‌సర్వేను పెట్టుకుంది. పాసుపుస్తకాలను రద్దు చేసి, 1బి రికార్డుల ద్వారానే రిజిస్ట్రేషన్లు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం వల్ల భూకుంభకోణానికి ఆస్కారముందని, పాసుపుస్తకాలను రద్దు చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వైసిపి ప్రారంభించిన 'గడప గడపకు వైయస్సార్ కాంగ్రెస్' కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుండి విశేషస్పందన కనిపిస్తోందన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేషన్ వైసిపి ఫ్లోర్‌లీడర్ పి.రూప్ కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com